VISALAANDHRA VIJAYAWADA Phone No. 376

4 పేజీలు ఒక అణా రిజిష్టర్డు నెం A 193

విశాలాంధ్ర

703743

సంపుటి 5 ★ విజయవాడ: మంగళవారం జూలై 10, 1956 ★ సంచిక 87

'అమెరికా సహాయం హానికరం'

జపాను సోషలిస్టునాయకుని హెచ్చరిక

టోకియో, జూలై 9

అమెరికా చేస్తున్న సైనిక "ఆర్థిక సహాయం" జపానుకు ఏమాత్రం ప్రయోజనకరం కాకపోగా, ఎంతో హాని కలిగిస్తున్నదని స్పష్టం చేస్తూ జపాను సోషలిస్టుపార్టీ అధ్యక్షుడు సుజుకీ నేడొక ప్రకటన చేశారు.

ఈజిప్టుకు చైనా యువజనప్రతినిధులు

పెకింగ్, జూలై 8

27 మందితో కూడుకున్న చైనా యువజన ప్రతినిధివర్గం ఈజిప్టులో పర్యటించేందుకు ఇక్కడనుంచి ఈ నెల 8వ తేదీన బయలుదేరి వెళ్ళింది. ముస్లిం యువజనుల అంతర్జాతీయ సమితి ఆహ్వానంపైన ఈ ప్రతినిధివర్గం ఈజిప్టు వెళ్లుతోంది.

ప్రభుత్వమే చౌకడిపోలద్వారా ఆహారపదార్థాలను అమ్మించాలి

నానాటికీ తీవ్రమౌతున్న ఆహారపరిస్థితిపై విశాలాంధ్ర కమ్యూనిస్టు మహాసభ తీర్మానం

ఆంధ్రప్రదేశ్‌లో ఎగువశాసనసభ అనవసరమని స్పష్టీకరణ

హైదరాబాద్, జూలై 9

తెలుగు దేశమంతటా ఆహారధాన్యాల ధరలు రోజురోజుకూ పెరుగుతున్న ఈ దశలో ప్రభుత్వం వెంటనే చౌకధాన్య డిపోల ద్వారా ప్రజలకు ఆహారధాన్యాల నందచేయాలని ప్రథమ విశాలాంధ్ర కమ్యూనిస్టు మహాసభ నిన్న తీర్మానించింది.

ఆహార సమస్యపై మహాసభ ఈ క్రింది తీర్మానం చేసింది:

తెలుగు దేశమంతటా ఆహార ధాన్యాల ధరలు రోజురోజు పెరగటంవల్ల పట్టణాల్లో, గ్రామాల్లో మధ్యతరగతి, బీద ప్రజలు, కార్మికులు, వ్యవసాయ కూలీలు నానా బాధలకు గురిఅవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అధికవర్షాలవల్ల పంటలు చెడిపోయి, ఆహార కొరత ఏర్పడ్డది. పెరిగిపోయిన ధరలకు ధాన్యం కొనలేక ప్రజలు ఆకలితో బాధపడుతున్నారు. ధరలు పెరగకుండా అరికట్టుతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సార్లు ప్రకటించినా నేటికీ ఎలాంటి గట్టి చర్యలు తీసుకోనందుకు యీ మహాసభ తన విచారాన్ని వ్యక్తపరుస్తూంది. ప్రభుత్వం వెంటనే చౌక ధాన్య డిపోలద్వారా ప్రజలకు ధాన్యం అమ్మటానికి ఏర్పాట్లు చేయాలని మహాసభ కోరుతోంది.

ఆంధ్ర ప్రదేశ్‌కు ఎగువ శాసనసభ

ఏర్పడబోతున్న విశాలాంధ్ర రాష్ట్రానికి ఎగువ శాసనసభ వుండ నవసరం లేదంటూ మహాసభ ఈ క్రింది తీర్మానం చేసింది:

ఆంధ్రప్రదేశ్‌లో పరోక్ష ఎన్నికల ద్వారా నిర్మించబడే ఎగువ శాసనసభ కావాలని వాంఛిస్తున్న కాంగ్రెస్ నాయకుల వాదనను యీ మహాసభ నిరాకరిస్తూంది. అనవసర ఖర్చు, వృథా కాలయాపనకు దోహదంచేసే 'లెజిస్లేటివ్ కౌన్సిల్' (ఎగువ శాసనసభ) అవసరంలేదని యీ మహాసభ అభిప్రాయపడుతూంది.

విజయవాడ - గుంటూరు కౌన్సిళ్ళ - రద్దు

విజయవాడ, గుంటూరు మునిసిపాలిటీలరద్దును నిరసిస్తూ విశాలాంధ్ర కమ్యూనిస్టు మహాసభ క్రిందివిధంగా తీర్మానించింది:

ఆంధ్ర దేశంలోగల ప్రధాన పట్టణాలగు విజయవాడ, గుంటూరు పురపాలక సంఘాలను సంవత్సర కాలం రద్దుపరచిన ఆంధ్ర ప్రభుత్వ చర్యను యీ మహాసభ తీవ్రంగా నిరసిస్తోంది.

ప్రజలు తమకిష్టమైన ప్రతినిధులను ఎన్నుకొని, ప్రజాస్వామ్య సూత్రాల ప్రకారం పురపాలక సంఘాలు ఏర్పడి పనిచేయుటకు గాను అవకాశం కల్పించాలని మహాసభ కోరుతూ, ఆంధ్రప్రభుత్వం ఆ రెండు పట్టణాలలో ఎన్నికలు జరుపుటకు తక్షణ చర్యలు తీసికోవాలని కోరుతోంది.

అకోలా, జూలై 8

రాష్ట్రాల పునర్నిర్మాణ బిల్లును చర్చించేందుకు లోక్‌సభ సమావేశమయ్యే సందర్భంలో జూలై 27వ తేదీన సంయుక్త మహారాష్ట్ర సమితి నాయకత్వాన ఒక సత్యాగ్రహదళం లోక్‌సభ ముందు ప్రదర్శనలు జరుపుతుందని సమితి ప్రధాన కార్యదర్శి శ్రీ యస్. యమ్. జోషి నేడిక్కడ ప్రకటించారు.

భారతదేశంలో ముడి ఫిల్ము తయారీ

పరిశ్రమ నిర్మాణానికి తూర్పు జర్మనీ నిపుణుల సూచన

న్యూఢిల్లీ, జూలై 7

ముడి ఫిల్మును తయారుచేసే పరిశ్రమను భారతదేశంలో నెలకొల్పడానికిగల అవకాశాలను పరిశీలించేందుకు ప్రభుత్వపు ఆహ్వానంపై ఇటీవల భారతదేశం వచ్చిన తూర్పు జర్మనీ నిపుణులు ప్రభుత్వానికి తమ నివేదికను అందజేశారని తూర్పుజర్మనీ అధికార వార్తాసంస్థ ఏ. డి. యన్. తెలిపింది. దక్షిణ భారతదేశంలోని నగరాలలో ఈ పరిశ్రమ నెలకొల్పేందుకు అవకాశాలున్నాయని ఈ నివేదికలో తెలిపారు. కొన్ని ప్రదేశాలను పేర్కొన్నారని కూడా ఏ. డి. యన్. తెలుపుతూంది.

కేంద్ర వర్తక పరిశ్రమల శాఖ కార్యదర్శి హెచ్. వి. ఆర్. అయ్యంగార్ నాయకత్వాన యూరప్‌లో పర్యటిస్తున్న భారత వాణిజ్య ప్రతినిధివర్గం ఇప్పుడు తూర్పు జర్మనీలో వున్నది. లీప్జిగ్‌నగరం సమీపంలో వోల్ఫెన్‌లోవున్న ఆగ్ఫా ఫిల్ము ఫ్యాక్టరీని ఆ ప్రతినిధివర్గం నిన్న సందర్శించింది. భారతదేశంలో ముడిఫిల్ము ఫ్యాక్టరీ నిర్మాణంగురించి అక్కడ కూడా నిపుణులతో చర్చలు జరిపారని తెలుస్తూంది.

ముక్కజీడి నూనె పరిశ్రమ కొరకై అభ్యర్థన

కేంద్ర భారీ పరిశ్రమల మంత్రికి మెమొరాండం

క్విలన్, జూలై 8

ముక్కజీడి గింజల పైపెంకుల నుంచి నూనె తీసే పరిశ్రమను రాష్ట్రంలో ఏర్పరచే పరిశ్రమలలో చేర్చవలసిందని నేడు క్విలన్‌లోని ఒక పెద్ద ముక్కజీడి గింజలవ్యాపారి కేంద్ర భారీ పరిశ్రమలమంత్రి శ్రీ ఎం. ఎం. షాకు ఒక మెమొరాండం సమర్పించారు.

ముక్కజీడిపిక్కలను వేయించేటప్పుడు వచ్చే నూనెను రంగులు, వార్నీషులు మొదలయిన ఎన్నో పరిశ్రమలలో వుపయోగించ వచ్చునని 1926 నుంచీ దీనిపై చేస్తున్న పరిశోధనలవలన తేలింది.

ఈ నూనెను అమెరికా, ఇంగ్లండు, జపాన్ మొదలయిన దేశాలు విశేషంగా తెప్పించుకుంటున్నాయి.

మనదేశంలో ఏటా పదకొండువేల టన్నుల నూనెను తయారుచేసే అవకాశాలుండగా, ప్రస్తుతం 5 వేల టన్నులే ఉత్పత్తి అవుతున్నదనీ, మిగిలిందంతా వ్యర్థం అవుతూందనీ ఆ మెమొరాండంలో తెలిపారు.

అందుచేత రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి ముక్కజీడినూనె పరిశ్రమను ప్రారంభించేటందుకు కేంద్రం ప్రయత్నించాలన్నారు.

బ్రిటన్‌కు రష్యా వర్తక ప్రతినిధివర్గం

పరస్పర వర్తకాభివృద్ధికి సంప్రతింపులకై

లండన్, జూలై 7

బ్రిటన్ - సోవియట్ వర్తకాన్ని పెంపొందించడం గురించి సంప్రతింపులు జరిపేందుకు బ్రిటన్‌కు రానున్న సోవియట్ ప్రతినిధివర్గంలో మొదటి జట్టు విమానంలో లండన్ చేరుకుంది. ఈ జట్టులో పది మంది ప్రతినిధులున్నారు. తక్కినవారు సోమవారం వస్తున్నారు.

ఇప్పుడు వచ్చినవారిలో సాంకేతిక నిపుణులూ, దుబాషీలూ ఉన్నారు.

పరస్పర వర్తకముపై ఆంక్షలూ, నిషేధాలూ, ఏవీగా లేకపోతే బ్రిటను నుండి సోవియట్ కొనుగోలు వచ్చే అయిదేళ్ళలో నూరుకోట్ల పౌనుల వరకు పెరుగగలదని ఈ ప్రతినిధివర్గంవారు పత్రికా విలేఖరులకు తెలిపారు.

ఎగుమతి దిగుమతి వర్తకాల మధ్యనున్న వ్యత్యాసం ప్రస్తుతం బ్రిటనుకు చాలనష్టదాయకంగా ఉన్నదనీ, సోవియట్ నిపుణులు అంటున్నట్లు సోవియట్ కొనుగోలు గాని పెరిగినట్లయితే అది బ్రిటనుకెంతో ప్రయోజనకరంగా ఉంటుందనీ బ్రిటిష్ వర్తకవర్గాలవారు వ్యాఖ్యానిస్తున్నారు.

చాంగ్‌ముఠానే బలపరిచేందుకు ఐసెన్‌హోవర్ హామీ

కరాచీ, జూలై 9

అమెరికా ఉపాధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ తైవాన్‌లో చాంగ్ కై షెక్ ముఠాతో మంతనాలు పూర్తి చేసుకొని ఈ వేళ కరాచీ చేరుకున్నారు. ఇక్కడ కొద్దిసేపు ఆగి ఆయన టర్కీ వెళ్తారు. ఇక్కడ ఆగిన కొద్దిసేపట్లోనూ ఆయన పాకిస్తాన్ అధ్యక్షుడు ఇస్కందర్ మీర్జాతో సంభాషణలు జరుపుతారు.

చాంగ్‌కై షెక్‌కు హామీ

తైవాన్ వెళ్ళినప్పుడు ఈ నిక్సన్ ద్వారా అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ చాంగ్ కై షెక్‌కి ఒక లేఖ పంపారు.

ఇకముందుకూడా చైనా ప్రభుత్వముగా చాంగ్ ముఠానే బలపరచేందుకు ఐసెన్‌హోవర్ ఆ లేఖలో హామీ ఇచ్చారు.

"కమ్యూనిజాన్ని ఎదుర్కొని నిలబడడంలో" చాంగ్ కై షెక్, అతనికి కొమ్ముకాస్తున్న వారూ కనబరుస్తున్న "ధైర్యసాహసాల"నూ, "అచంచల వైఖరి"నీ ఐసెన్‌హోవర్ ఆ లేఖలో ఎంతగానో ప్రశంసించారు.

బ్రిటను ఆర్థిక జీవనంలోని హెచ్చు తగ్గులు

◆◆◆

రూపుమాపటానికి లేబరుపార్టీ నూతన కార్యక్రమం

లండన్, జూలై 8

ఈసారి తాము అధికారంలోకి వచ్చిన పక్షంలో సమాజంలోగల ఆర్థిక హెచ్చుతగ్గులను రూపుమాపటానికి ముఖ్యమైన చర్యలుతీసుకుంటామని బ్రిటిషు లేబరుపార్టీవారు వాగ్దానం చేస్తూ నిన్నొక ప్రకటన జారీచేశారు.

"సమానత్వలక్ష్యం" అన్నశీర్షికతో బ్రిటిష్ లేబర్‌పార్టీ తన నూతన కార్యవిధానాన్ని ప్రకటించింది. అందులో ఈ క్రింది ప్రధానాంశాలు వున్నాయి:

పెద్ద పెద్ద స్థితిపరులు ఖర్చుపెట్టే మొత్తంపైన పన్ను విధించాలన్న ప్రతిపాదనను లేబరుపార్టీ పరిశీలిస్తోంది; భూమి, పరిశ్రమలపైన ప్రజా యాజమాన్యాన్ని విస్తరింపచేసే విషయం లేబరుపార్టీ ఆలోచిస్తోంది.

పెట్టుబడి లాభాలపైన, ఆస్తి పాస్తులు, పరిశ్రమలలోని వాటాల మార్పిడిపైన పన్ను విధించబడుతుంది.

ఏటా రు. 26,666 లకు పైగా (2000 పౌనులు) ఆదాయం వచ్చేవారిపైన విశేషపు పన్ను విధించాలని లేబరుపార్టీ ఆలోచిస్తున్నదట.

కొత్త సంపదకు మూలాధారాలైన ఆస్తి, భూమి, పరిశ్రమలు మున్నగువాటిపై ప్రజా యాజమాన్యాన్ని విస్తరింపచేయటంద్వారా ఆర్థిక అసమానత్వాలను తొలగించాలని లేబరుపార్టీ ఆలోచిస్తున్నది.

కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమైన సంపద

జాతీయ సంపదలో దాదాపు సగభాగం కొన్నివందలమంది చేతుల్లో కేంద్రీకృతమై వున్నదనీ, బ్రిటనులోని కీలకమైన ఆర్థికసమస్య ఇదేననీ బ్రిటిష్ లేబర్ పార్టీ భావిస్తోంది. అంతూపంతూ లేని ఈ ఆర్థిక కేంద్రీకరణను వికేంద్రీకరించవలసిన అవసరం ఎంతో వుంది.

అందుకు ఆర్థిక గుత్తాధిపతులకు ప్రతికూలంగా తీవ్రమైన చర్యలు తీసుకోవలసి వుంటుంది.

వర్గ రాహిత్య సమాజాన్ని స్థాపించాలంటే, ప్రస్తుతంవున్న విద్యా విధానాన్ని సమూలంగా మార్చివేయవలసిన అవసరం వుందని బ్రిటిషు లేబరు పార్టీ భావిస్తోంది.

రైలు ప్రయాణం ముగింపులో పన్ను

మునిసిపాలిటీలకు అధికారం ఇస్తూ బిల్లు రాగలదట

మద్రాసు, జూలై 8

కార్పొరేషన్లూ, మునిసిపాలిటీలూ బయటి నుంచి తమ నగరానికి వచ్చే రైలు ప్రయాణీకుల నుంచి ప్రయాణాంతపు పన్ను వసూలు చేసే అధికారం ఇచ్చేటందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతినిస్తూ కేంద్ర రైల్వేల మంత్రి త్వరలోనే పార్లమెంటులో ఒక బిల్లు తేబోతున్నారని శ్రీ టి. టి. కృష్ణమాచారి ఇక్కడ అన్నారు.

మద్రాసు కార్పొరేషను ఇచ్చిన సన్మానానికి ఆయన సమాధానం ఇస్తూ ఈ విషయం చెప్పారు.

కార్పొరేషన్లు ప్రజలకు ఎక్కువ సౌకర్యాలు కలిగించడానికి కావలసిన ధనాన్ని సంపాదించేటందుకై ఈ పన్ను వేసుకోనిస్తారని ఆయన చెప్పారు.

పరమానందయ్యకు కొత్త శిష్యులు



"అధికాహారోత్పత్తిని గురించి ముస్సోరీలో తర్జనభర్జనలు జరిపిన వ్యవసాయమంత్రులు భూసంస్కరణలను గురించి మాత్రం ప్రస్తావించలేదు."

సైప్రస్ సమస్యపై బ్రిటిష్ మంత్రివర్గ అవసర సమావేశం

లండన్, జూలై 9

సైప్రస్‌లో ఇక ఇప్పుడుతీసుకోవలసిన చర్యలనుగురించి బ్రిటిష్ ప్రధాని చెకర్స్ గ్రామంలోని తన భవనంలో నేడు అత్యవసర మంత్రివర్గ సమావేశం జరిపారు. మంత్రివర్గంలోని ముఖ్యులనందర్నీ ఈ సమావేశానికి ఆహ్వానించారు. ఎక్కడెక్కడ విశ్రాంతి తీసుకుంటూ వినోదాల్లో ఉన్న మంత్రులందరూ హుటాహుటిని ఈ సమావేశానికి వచ్చారు.

వలసశాఖ మంత్రి లెన్నాక్స్ బాయ్డు, విదేశాంగమంత్రి సెల్విన్ లాయిడు, రక్షణశాఖ మంత్రి సర్ వాల్టర్ మాంక్టన్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పార్లమెంటులో సైప్రస్ సమస్యపై ప్రభుత్వం ఈ వారంలో ఒక ప్రకటన చేయ నిశ్చయించింది. ఈ ప్రకటన రూపురేఖల్ని దిద్దడం నేటి అత్యవసర సమావేశ కార్యక్రమాల్లో ఒకటి.

పదేళ్ళలో సైప్రస్ దీవికి స్వపరిపాలనను ఇవ్వడానికీ, ఆ తరువాత బ్రిటన్, గ్రీసు, టర్కీల త్రైపాక్షిక హామీలతో అక్కడ బ్రిటన్ 'ఒక స్థావరాన్ని' ఏర్పాటు చేసుకోవడానికీ, బ్రిటన్ ఇటీవల ఒక పథకం తయారుచేసింది. అయితే టర్కీ ప్రభుత్వం అందుకు ఒప్పుకోలేదనీ, అందువల్ల తాము ఆ పథకాన్ని వదులుకోవలసి వచ్చిందని బ్రిటిష్ ప్రభుత్వవర్గాలు ఇప్పుడంటున్నారు.

అధికభాగం గ్రీక్ ప్రజలున్న ఈ సైప్రస్‌దీవి మున్నుడు టర్కీ సామ్రాజ్యభాగమనీ, దానిని మునుపటి టర్కీ పాలకులు బ్రిటన్‌కు అప్పగించారనీ, అందువల్ల ఇప్పుడాదీవి చేతులుమారవలసివస్తే తమకే రావాలిగాని, గ్రీసుకు ఇవ్వడానికి వీల్లేదని చెబుతూ టర్కీ ప్రభుత్వం మొండికేస్తూ సైప్రస్ సమస్యా పరిష్కారానికి అడ్డంకులు కల్పిస్తున్న విషయం పాఠకులకు తెలిసినదే. సైప్రస్‌దీవి జనాభాలో అత్యధికభాగం గ్రీకు ప్రజలే అయినా, టర్కీవారుకూడా చాలామందిఉన్నారు.

మధుర, రామనాథపురం, జిల్లాలకు చెందిన యస్. సి. వో సంఘ ప్రతినిధులు, మద్రాసు ముఖ్యమంత్రి, కామరాజ నాడార్‌ను కలుసుకున్నారు.

85 మంది భారతీయ నావికులకు అణుకిరణాలు సోకేప్రమాదం: బ్రిటన్ ఘాతుకచర్య

బొంబాయి, జూలై 8

85 మంది భారతీయ నావికులను బలిపశువులుగా ఉపయోగించే ఘాతుకానికి బ్రిటిష్ ప్రభుత్వాధికారులు ఒడిగట్టుతున్నారని నేడిక్కడ విశ్వసనీయంగా తెలుస్తోంది.

బ్రిటిష్ రవాణాశాఖకు చెందిన "చార్లటన్ స్టార్" నౌకలో పనిచేసేందుకు 85 మంది భారతీయులను, మరొక 100 మంది తూర్పు ఆఫ్రికా, సైప్రస్ వాసులను బ్రిటిషు ప్రభుత్వం నియమించింది. జూన్ 27వ తేదీన ఆనౌక సౌథాంప్టన్ నుంచి పసిఫిక్‌లో మారుమూలనున్న క్రిస్ట్‌మస్ దీవుకు పయనమై వెళ్ళింది. క్రిస్టమస్ దీవులలో హైడ్రోజన్ బాంబుల పాటవ పరీక్షలను జరపాలని బ్రిటిషు ప్రభుత్వం తలపెట్టిన విషయం ఈ సందర్భంలో గమనార్హమని ఇక్కడి రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

ఆ నౌకలోని బ్రిటిషు సైనికోద్యోగులకు రేడియో ధార్మికశక్తి సోకకుండా వుండే గుడ్డ ప్రత్యేక దుస్తులను బ్రిటిషు ప్రభుత్వం సమకూర్చిందనీ, భారతీయ, తదితర నావికులకుమాత్రం అలాంటి దుస్తులను సరఫరా చేయలేదని నౌకాయాన వర్గాల ద్వారా తెలియవస్తున్నది.

జాతీయ నావికుల సంఘంవారు ఈ విషయంలో తమ అభ్యంతరాన్ని భారత ప్రభుత్వానికి అందజేసినట్లు రూఢిగా తెలుస్తోంది. "చార్లటన్ స్టార్"లో పనిచేస్తున్న భారతీయులకు తగిన రక్షణలు కల్పించేటట్లు తక్షణం చర్యతీసుకోవాలని వారు భారత ప్రభుత్వాన్ని కోరారు.

కాశ్మీర్‌లోని భూగర్భ సంపద

ప్రాముఖ్యతను కేంద్ర ప్రభుత్వం విస్మరించటంలేదట

శ్రీనగర్, జూలై 8

జమ్మూ, కాశ్మీర్‌లలో భూగర్భ సంపదను త్రవ్వి, పైకి తీయవలసిన అవసరాన్ని భారత ప్రభుత్వం అలక్ష్యం చేయటంలేదని కేంద్ర సహజ సంపదలశాఖా మంత్రి శ్రీ కె. డి. మాలవ్యా నేడిక్కడ ప్రకటించారు.

భారత భూగర్భ పరిశోధన సంస్థ ప్రాంతీయ కార్యాలయానికి శ్రీ మాలవ్యా నేడిక్కడ ప్రారంభోత్సవం చేశారు.

భూగర్భ సంపదను త్రవ్వి పైకి తీసే విషయంలో ఖర్చు ఎక్కువైనా, డబ్బుకు తగిన ప్రతిఫలం గిట్టుబాటు అవుతుందా అన్న అంశం ముఖ్యం కాక తప్పదని ఆయన అన్నారు.

వంశధార ప్రాజెక్టు నిర్మాణ సమస్య

డాము ఎత్తు 1.7 అడుగు లుంచడానికి నిర్ణయం

కర్నూలు, జూలై 9

వంశధార ప్రాజెక్టుడాము ఎత్తు 157 అడుగులుంచడానికి ఒరిస్సా ప్రభుత్వం అంగీకరించినట్లు ఆంధ్ర అధికార ప్రతినిధి ఒకరు నేడు తెలియజేశారు.

డాము ఎత్తు 62 అడుగులుంటే పర్లాకిమిడి పట్టణానికి ముంపు దెబ్బ తగిలే పరిస్థితి ఏర్పడుతుంది. అందుచేత డాము ఎత్తు 157 అడుగులుండడానికి నిర్ణయించారు.

అంతేకాక ఇంకా రక్షణలు కల్పించడంకోసం వర్షాకాలంలో రిజర్వాయరును పూర్తిగా నింపకుండా ఉంచుతారు. రక్షణగట్లుకూడా నిర్మిస్తారు. డాముస్థలానికి పర్లాకిమిడి 8 మైళ్ళ దూరంలో ఉంటుంది. రిజర్వాయరు పరిమాణం 19 యూనిట్లు. నది ప్రవాహ పరిమాణం 93 యూనిట్లు ఉంటుంది. (యూనిట్ 100 కోట్ల ఘనపుటడుగులు).

గొట్టావద్ద నిర్మించే రిజర్వాయరుకు 11 కోట్లు వ్యయం అవుతుంది. రెండు లక్షల ఎకరాలు సాగవుతుంది. ఈ నిర్మాణ బాధ్యత అంతా ఆంధ్ర ప్రభుత్వానిదే.

బోలే సన్నా నాయి పై రిజర్వాయరు, జల్తేరి - గుణుపూరుల మధ్య బ్యారేజి నిర్మాణావకాశాలను ఒరిస్సా - ఆంధ్ర ప్రభుత్వాలు పరిశీలిస్తాయి. ఆర్థికంగా లాభదాయకంగా ఉంటే నిర్మాణానికి పూనుకుంటారు.

గొట్టావద్ద నిర్మాణానికి, సన్నా నాయి రిజర్వాయరు నిర్మాణ పరిశీలనకు అవసరమైన సిబ్బందిని ఆంధ్ర ప్రభుత్వం త్వరలోనే నియమించనున్నది. (పి. టి)

"ప్రజల నైతికస్థాయి పెంపొందాలి"

కటక్, జూలై 8

గాంధీ మహాత్ముడు కలలుగన్న రామరాజ్యం నెలకొల్పాలంటే ప్రజల నైతికస్థాయినీ, బుజువర్తననూ పెంపొందించవలసిన అవసరం ఎంతేని కలదని అఖిలభారత ప్రజాసమితి అధ్యక్షుడు శ్రీ పురుషోత్తమదాస్ టాండన్ నేడిక్కడ నొక్కిచెప్పారు.

ఉత్తర వియత్నాంలో సోషలిస్టు పరివర్తన

తొలి ప్రాతిపదిక పరిపూర్తి

హానోయ్, జూలై 8

జూన్ మాసాంతానికి ఉత్తర వియత్నాంలోని రైతులలో నూటికి 58.7 వంతుల మంది పరస్పర సహాయక దళాలలో సభ్యులుగా చేరారని వియత్నామ్ వార్తాసంస్థ నేడిక్కడ ప్రకటించింది.

సమిష్టి వ్యవసాయానికి తొలి ప్రాతిపదికే పరస్పర సహాయక దళాల నిర్మాణం అన్న విషయం పాఠకులకు విదితమే.

ఈ సంవత్సరాంతానికి సమస్తం రైతు కుటుంబాలలో నూటికి అరవైవంతుల కుటుంబాలను పరస్పర సహాయక దళాలలో సభ్యులుగా చేర్పించాలని ఉత్తర వియత్నామ్ ప్రభుత్వం తలపెట్టుకొంది.

పరస్పర సహాయకదళాల నిర్మాణం వల్ల వ్యవసాయోత్పత్తి అపారంగా పెరిగిందని వియత్నామ్ వార్తాసంస్థ ప్రకటనలో పేర్కొనబడింది.

ఉప్పు దిగుమతులు

మద్రాసు, జూలై 8

వచ్చే సెప్టెంబరు నెల నాటికి ఉప్పు దిగుమతులు ప్రభుత్వాధీనంలో వుంటాయని వాణిజ్యం, పరిశ్రమలమంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి నేడిక్కడ అన్నారు.

ప్రస్తుతం ఉప్పు దిగుమతులలో కొంతభాగం వ్యక్తులద్వారా జరుగుతున్నదనీ, ప్రభుత్వం కంట్రోలు ఏర్పాటైనా ఉప్పు హెచ్చుగా వుపయోగించేవారికే పెర్మిట్లు నిస్తారని ఆయన అన్నారు.

1956 జూలై 10 మంగళవారం
దుర్ముఖినామ సంవత్సర
ఆషాఢ శుద్ధ
తదియ రా. 11-45
ఆశ్లేష రా. 10-56

విశాలాంధ్ర

మంగళవారం 10-7-56

నూతన భవిష్యత్తు

ముక్కోటి తెలుగు ప్రజల చిరకాల వాంఛితమైన విశాలాంధ్రరాష్ట్రం త్వరలో ఏర్పడనున్నది. ఆంధ్ర, తెలంగాణా అను కృత్రిమ విభజనలు ఇక అంతరిస్తాయి. ఇట్టి మహత్తర చారిత్రక సమయంలో యావదాంధ్ర ప్రజల సర్వతోముఖాభివృద్ధికి అవసరమయిన ఒక కార్యక్రమ ప్రాతిపదికపై ఆంధ్ర ప్రజలందరూ ఐక్యకృషి సాగించేందుకు దీక్ష వహించటం ఎంతో అవసరం.

ఇట్టి లక్ష్యంతోనే, వారం రోజులుగా హైద్రాబాద్‌లో జరుగుతున్న విశాలాంధ్ర కమ్యూనిస్టు మహాసభ, ఆంధ్ర ప్రజలముందొక విస్తృత కార్యక్రమాన్ని ఉంచింది.

ఆంధ్రప్రదేశ్ జన సంఖ్య 3 కోట్ల 15 లక్షలు. వైశాల్యం 1 లక్షా పదివేల చదరపు మైళ్లు. 700 మైళ్ళసముద్రతీరం, బొగ్గు, ఇనుము, సిమెంటురాయి, మాంగనీసు, మైకా మొదలైన ఖనిజసంపద. విశాలమైన అడవులు మనకున్నాయి. పత్తి, మేలురకం పొగాకు వంటి వ్యాపార పంటలను మనం పండిస్తున్నాం. ఈ అపారమైన సహజ సంపదను వినియోగంలోకి తెచ్చిన నాడు ఆంధ్రరాష్ట్రం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి కాగలదు. ఇంతవరకూ, ఈ విషయమై పరిపాలకులు పూర్తి నిర్లక్ష్యం వహిస్తూ వచ్చారు

కనుకనే, విశాలాంధ్ర కమ్యూనిస్టు మహాసభ, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధికై ఒక సమగ్ర కార్యక్రమాన్ని ఇచ్చింది. విశాఖపట్నం రేవును వృద్ధిచేసి, అక్కడ ఒక డీజిల్ ఇంజనుల కర్మాగారాన్ని నిర్మించాలని. కొత్తగూడెంలో ఎరువులఫ్యాక్టరీని, సికింద్రాబాద్‌లో మీటర్ గేజి రైలు పెట్టెల కర్మాగారాన్ని, అనువైన ప్రాంతాలలో, బట్టలమిల్లులను, సిగరెట్ ఫ్యాక్టరీలను, పంచదార మిల్లులనూ స్థాపించాలని సూచించింది.

ఆంధ్ర ప్రజలలో నూటికి 70 మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు గ్రామీణ ప్రజల జీవనస్థాయి పెంపు చెందినప్పుడే పారిశ్రామికాభివృద్ధి సాధ్యం కాగలదు. ఇందుకు ప్రాజెక్టుల నిర్మాణం, భూ సంస్కరణలు-రెండూ అత్యవసరం.

నాగార్జున సాగర్, గోదావరీ లోయ, తుంగభద్ర ఎగువ కాలువ, సిద్ధేశ్వరం, వంశధార, ఇంచంపలి ప్రాజెక్టుల నిర్మాణం సత్వరమే కొనసాగాలని విశాలాంధ్ర కమ్యూనిస్టు మహాసభ సూచించింది.

ఆంధ్రరాష్ట్రంలో ఇంతవరకూ భూ సంస్కరణలు అమలు జరగలేదు. తెలంగాణాలో ప్రవేశపెట్టబడిన భూ సంస్కరణల చట్టం ఆచరణలో సరిగా అమలు జరుగుట లేదు. ఆంధ్ర ప్రభుత్వం నియమించిన శ్రీ లక్ష్మీరాజు సుబ్బారావు కమిటీ, ప్రస్తుత భూస్వామ్య సంబంధాలను దాదాపు చెక్కుచెదరకుండా ఉండేందుకు మాత్రం ఉపయోగించే సూచనలను చేసింది. కనుక భూ సంస్కరణాలకు సహజంగానే ప్రత్యేక ప్రాధాన్యమున్నది. రు. 3600 లు నికరాదాయం, లేక, రు. 4800 లు ఫలసాయం కలిగిన భూమిని గరిష్ట పరిమితిగా భావించి, ఆపై భూమిని వ్యవసాయ కూలీలకు, పేదరైతులకు పంచిపెట్టాలని, ప్రస్తుతమున్న కౌలు రేట్లను తగినంతగా తగ్గించాలని, కౌలు కాలాన్ని అయిదేండ్లుగా నిర్ణయించాలని కమ్యూనిస్టు మహాసభ సూచించింది. పెద్ద భూస్వాములకు నష్టపరిహారం చెల్లించ నక్కరలేదని, అంతగా అవసరమనుకుంటే బాండ్ల రూపంలో, గ్రేడెడ్ పద్ధతిని అనుసరించి చెల్లించాలని సూచించింది.

ఈ రెండు ప్రధాన సమస్యలను గురించి మాత్రమే గాక, ఆంధ్ర ప్రజల సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన ఇతర సమస్యలను గురించికూడా కమ్యూనిస్టు మహాసభ సమగ్రమైన కార్యక్రమాన్ని ఇచ్చింది. కార్మికుల జీవిత పరిస్థితులను మెరుగు చేయాలని, వెనుకబడిన ప్రాంతాల ప్రజల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాలని సూచించింది. అల్పసంఖ్యాకుల హక్కులను రక్షించాలని, మూడవ ఫారంవరకు నిర్బంధ ఉచిత విద్యావిధానం ప్రవేశపెట్టాలని, హైస్కూళ్ళలోను, కాలేజీలలోను విద్యాబోధ మాతృభాషలోనే జరగాలనీ స్పష్టంచేసింది.

అనవసరమైన ఖర్చుకూ, వృధా కాలయాపనకూ దారితీసే ఎగువ శాసనసభ ఆంధ్రప్రదేశ్‌కు వద్దనీ, ప్రజాతంత్ర సూత్రాల కనుగుణంగా యావదాంధ్రలోనూ ఒకేసారి ఎన్నికలు జరపాలనీ విశాలాంధ్ర కమ్యూనిస్టు మహాసభ తీర్మానించింది.

పంచాయతీ జిల్లాబోర్డుల పరిపాలన ప్రజాతంత్రంగా ఉండాలనీ, ప్రభుత్వ పరిపాలనా యంత్రాన్ని సంస్కరించాలనీ మహాసభ సూచించింది. సరిహద్దుల నిర్ణయం విషయంలో ఆంధ్రదేశానికి జరిగిన అన్యాయాన్ని తొలగించాలని హెచ్చరించింది.

రాష్ట్రాదాయాలను పెంపు చేసేందుకై కొన్ని సూచనలను చేసింది. ఆదాయపు పన్ను, ఎక్సైజు పన్నులలోనుంచి కేంద్రం చెల్లించేవాటా ఎక్కువ చేయాలని, నిజాం నవాబుకిస్తున్న భరణాన్ని రద్దుచేయాలని కోరింది.

ఈ కార్యక్రమాన్ని ఆచరణలో పెట్టేందుకై, ఆంధ్ర ప్రజల శ్రేయస్సును కాంక్షించే పార్టీలు, సంస్థలు, వ్యక్తులు - అందరూ, తమపాత విభేదాలను విస్మరించి, ఐక్యకృషి సాగించాలని విశాలాంధ్ర కమ్యూనిస్టు మహాసభ విజ్ఞప్తి చేసింది.

విశాలాంధ్ర అవతరణ ఆంధ్ర జాతి చరిత్రలో ఒక సువర్ణ ఘట్టం. ఆంధ్ర ప్రజలందరూ ఏకమై విశాలాంధ్ర సర్వతోముఖాభివృద్ధికి కృషిచేసిననాడు ఒక నూతన భవిష్యత్తును మనం నిర్మించుకోగలము. సంకుచిత రాజకీయ విభేదాలను పక్కకు నెట్టి, విశాలదృష్టితో ఆంధ్ర ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని శ్రద్ధతో పరిశీలించగలరని ఆశించుచున్నాం. ఆంధ్ర ప్రజల ఐక్యకృషికి ఇది ఒక ప్రాతిపదిక కాగలదని భావించుచున్నాం.

తెలుగుప్రజలసర్వతోముఖాభివృద్ధికి విశాలాంధ్ర కమ్యూనిస్టు మహాసభ సూచనలు

ప్రజాశ్రేయస్సును కాంక్షించే పార్టీలు, సంస్థలు, వ్యక్తులు అందరితోనూ కమ్యూనిస్టుపార్టీ సహకరిస్తుందని స్పష్టీకరణ

విశాలాంధ్ర ప్రథమ కమ్యూనిస్టు మహాసభ ఆమోదించిన రాజకీయ తీర్మానంలో తొలిభాగాలను 8 వ తేదీ పత్రికలో ప్రకటించాం. పరిశ్రమలు, రైల్వేలు, రేవులు, విద్యా, వైద్య సౌకర్యాలు, వెనుకబడివున్న ప్రాంతాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు, ప్రభుత్వ యంత్రాంగంలో తేవలసిన మార్పులు మున్నగు వాటిని గురించిన తరువాయి భాగాలను నేడు ప్రకటిస్తున్నాం.

1. కాకిరాయి, బొగ్గులభ్యమయ్యే కొత్తగూడెం, రామగుండం ప్రాంతాల్లో ప్రభుత్వం ఉక్కు ఫ్యాక్టరీలను నిర్మించాలి.

2. తెలంగాణా ప్రాంతంలో యిదివరకే ప్రభుత్వ యాజమాన్యాన నడుస్తున్న రోడ్డు రవాణా మొదలైన పరిశ్రమలను ప్రభుత్వ యాజమాన్యాన నడపాలి. కొన్ని ముఖ్యమైన ప్రభుత్వ పరిశ్రమలను బిర్లాలవంటి గుత్తవ్యాపారస్తుల కైవశం చేస్తూండడం నూతన రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి భంగకరం. అందుచేత ప్రభుత్వం యీ విధానాన్ని విడనాడాలి.

3. విశాఖపట్నంలో ప్రభుత్వం డీసెల్ ఇంజన్లను తయారుచేసే ఫ్యాక్టరీని స్థాపించాలి.

4. కొత్తగూడెంలో యెరువుల ఫ్యాక్టరీని నిర్మించాలి.

5. కోస్తా ప్రాంతంలో నూనె బావులు నిర్మించి, నూనె పరిశ్రమను అభివృద్ధిచేయాలి.

6. కోస్తాతీరంలో సోడాయాష్ ఫ్యాక్టరీని నెలకొల్పాలి.

7. అనంతపురం జిల్లాలోని వజ్రకరూరు ప్రాంతంలో వజ్రపు గనులను సర్వే చేయించి వజ్ర పరిశ్రమను నెలకొల్పాలి.

8. విశాలాంధ్రలో భూగర్భ పరిశోధన సర్వే చేయించాలి.

9. పత్తి విరివిగా పండే రాయలసీమలో నూలు, చెరకు ఉత్పత్తిచేసే ప్రాంతాల్లో పంచదార ఫ్యాక్టరీలు పెట్టాలి. బట్టల మిల్లులను ఎక్కువగా స్థాపించాలి.

10. వర్జీనియా పొగాకు విరివిగా పండుతున్న గుంటూరు, రాజమండ్రి, కొవ్వూరు ప్రాంతాల్లో సిగరెట్ ఫ్యాక్టరీలను నెలకొల్పాలి.

11. గ్రామసీమలలో అనేకమంది చేతివృత్తులపై ఆధారపడి వున్నారు. చేనేత పారిశ్రామికుల, తదితర వృత్తిదారుల అభివృద్ధికై ప్రభుత్వం సహకార సంఘాలను నెలకొల్పి చేతివృత్తులకు రక్షణ కలిగించాలి. ఉత్పత్తి ఐన సరుకులకు మార్కెటింగ్ సౌకర్యాలు కలుగచేసి, అవి విడుదల అయ్యే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలి.

12. మద్యనిషేధచట్టం పూర్తిగా విఫలమైంది, దానివల్ల గీత కార్మికులు నిరుద్యోగులయారు. ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక అభివృద్ధి లేనిదే మద్యనిషేధం జయప్రదంకాదు. కనుక తెలంగాణాలో మద్యనిషేధం పెట్టరాదు. ఆంధ్ర ప్రాంతంలో మద్యనిషేధ చట్టాన్ని రద్దుచేయాలి.

13. సికింద్రాబాదులో మీటరు గేజి పెట్టెలను నిర్మించే ఫ్యాక్టరీని స్థాపించాలి.

14. సికింద్రాబాదును కేంద్రంగా వుంచి, వాల్తేరు, విజయవాడ, సికింద్రాబాదు, గుంతకల్లు డివిజన్లను కలిపి నూతన రైల్వే జోనును ఏర్పాటు చేయాలి.

15. హైద్రాబాదును ఆంధ్ర దేశంలోని అన్ని ప్రాంతాలతో కలుపుతూ రైలుమార్గాలను నిర్మించాలి.

16. సముద్రతీరంలో ఆధునిక పడవలతో లోతుకుపోయి చేపలుపట్టే కేంద్రాలు ఏర్పాటుచేయాలి.

17. వ్యాపార బ్యాంకులు, గోడౌన్లు మొదలైన సౌకర్యాలను కల్పించి, విశాఖపట్నంరేవును ఆంధ్రదేశానికి ఎగుమతి, దిగుమతిరేవుగా అభివృద్ధి చేయాలి. కాకినాడ, బందరు మొదలైన మైనర్ రేవుపట్టణాలను అభివృద్ధిచేయాలి.

18. రాయలసీమలో చెప్పులపరిశ్రమ, పింగాణి, జాయింట్స్, సబ్బులు మొదలైన పరిశ్రమలను స్థాపించాలి.

19. ఏజన్సీ ప్రాంతాలకు దగ్గరగా కాగితపు పరిశ్రమను నెలకొల్పాలి.

2. విద్యా వైద్య సౌకర్యాలు

1. మన మొత్తం విద్యా విధానాన్ని జాతీ ప్రయోజనాల కనుగుణ్యంగా ప్రభుత్వం మార్పుచేయాలి పాఠ్యగ్రంథాలను సవరించాలి.

2. ఇప్పుడున్న అవసరాలకు తగినట్లుగా ముఖ్యంగా దేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి అవసరమైనన్ని ఇంజనీరింగు, వైద్యం మొదలైన వృత్తి విద్యలకు సంబంధించిన సాంకేతిక కళాశాలలను, స్కూళ్ళను విరివిగా స్థాపించాలి వృత్తి విద్యలకు అవసరమైన శాఖలలో స్వల్పకాల (షార్టుటరమ్) సాంకేతిక కళాశాలలను, స్కూళ్ళను స్థాపించాలి.

3 మూడవ ఫారంవరకూ బాలబాలికలకు నిర్బంధ, ఉచిత విద్యను అమలు జరపాలి.

4. కనీసం రెవెన్యూ ఫిర్కాకు ఒకటి చొప్పునహైస్కూళ్లు పెట్టాలి. మాధ్యమిక పాఠశాలలను విరివిగా స్థాపించాలి. ప్రస్తుతం కళాశాలలులేని తెలంగాణా జిల్లాలలో కనీసం జిల్లాకు ఒక మొదటి తరగతి కళాశాలనైనా స్థాపించాలి.

5. విశ్వవిద్యాలయాల్లో విద్యాబోధన, ప్రభుత్వ కార్యకలాపాలు తెలుగులోనే జరగాలి

6. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కేంద్రప్రభుత్వం తీసుకోడానికి జరిగిన, జరుగుతున్న ఆలోచనలను విరమించుకొని, దాన్ని హిందీ విశ్వవిద్యాలయంగా మార్చాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి.

7. వ్యవసాయ కూలీలలో ప్రధాన భాగమైన హరిజనులు, హరిజన క్రైస్తవులు, తదితర నిమ్నజాతి ప్రజలు విద్యలో చాల వెనుకబడియున్నారు. వారి పట్ల ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధతీసుకుని, ప్రతితాలూకా ముఖ్య కేంద్రాలలో ఒక వసతి గృహాన్ని ఏర్పాటుచేయాలి. అలాగే వివిధ వసతి గృహాలలో ఉన్న విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్పులివ్వాలి.

8. విద్యావిషయంలో స్త్రీలు వెనుకబడియున్నారు. అందువల్ల వారి విద్యాభివృద్ధికి ప్రభుత్వం తగుచర్యలు తీసుకోవాలి.

9 ప్రభుత్వం సాహిత్య, సంగీత, నాట్య, చిత్రకళల అభివృద్ధికి తగు సౌకర్యాలు కల్పించాలి

10. భాషాకోవిదుల సహకారంతో పారిభాషిక పదాలకుసరైన తర్జుమాలు, ఉన్నత విద్యకు సంబంధించిన పాఠ్యగ్రంథాలు పట్టుదలతో వ్రాయించాలి.

11. ఇప్పటికన్నా వైద్య సౌకర్యాలను పెంచాలి. ఫిర్కాకు ఒకటి చొప్పున ప్రసూతి కేంద్రంతోకూడిన ఆసుపత్రి నెలకొల్పాలి.

12. మురికి పేటలలో మలేరియా, మశూచి, కలరా మొదలైన వ్యాధుల నివారణకు ప్రత్యేకశ్రద్ధ వహించాలి.

13. గ్రామాలలోను, పట్టణాలలోను మంచినీటి సౌకర్యం కలిగించాలి.

3. వెనుకబడిన ప్రాంతాలు

ఆంధ్రదేశం మొత్తంగా యితర కొన్ని రాష్ట్రాలకన్న వెనుకబడివున్నా ఆంధ్రదేశంలోని అన్ని ప్రాంతాలు ఒకేవిధంగా అభివృద్ధి చెందలేదు. తెలంగాణా, రాయలసీమ, శ్రీకాకుళం మొదలైన ప్రాంతాలు ఆర్థికంగా వెనుకబడి వున్నవి. వాటికి ప్రత్యేకశ్రద్ధ చూపి అభివృద్ధి చేయవలసిన బాధ్యతవుంది. తెలంగాణా ప్రాంతంలో కొందరిలోవున్న అనుమానాలను పోగొట్టి ఆంధ్ర - తెలంగాణా ప్రాంతాలమధ్య సంపూర్ణమైన ఐక్యతను నెలకొల్పవల్సివుంది. అందుకు సర్వజనామోదం పొందిన యీ క్రింది సూచనలు అమలు జరపాల్సివుంది.

1 అభివృద్ధి స్కీముల్లో తెలంగాణాకు ప్రాధాన్యత నివ్వాలి. ప్రత్యేకంగా గోదావరీలోయ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలి. తెలంగాణా అబ్కారీ ఆదాయాన్ని తెలంగాణా ప్రాంతపు అభివృద్ధికే ప్రత్యేకించాలి.

2. తెలంగాణాలోని యూనివర్సిటీ, కాలేజీలు, టెక్నికల్ కాలేజీలలో నేడున్న సీట్లకు తగ్గకుండా అదనపు సీట్లను తెలంగాణా ప్రాంతి విద్యార్థులకు ప్రత్యేకించాలి. ప్రజల్లో విద్యాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

హైద్రాబాదు విశాలాంధ్ర రాజధాని కావడంవల్ల వచ్చే ఉద్యోగుల, యితరుల పిల్లలకు అదనంగా సౌకర్యాలు కల్పించాలి.

3. ఉద్యోగుల్లో తెలంగాణా జనాభానుబట్టి మూడవవంతు సంఖ్యను వారికి ప్రత్యేకించాలి.

అల్ప సంఖ్యాకుల హక్కులు

అల్ప సంఖ్యాకుల రక్షణ విషయంలో ఆంధ్ర తెలంగాణా కమ్యూనిస్టు కమిటీలు ఫజులాలీ కమీషనుకు సమర్పించిన విజ్ఞాపనలోని యీ క్రింది అంశాలను విశాలాంధ్ర కమ్యూనిస్టు మహాసభ పునరుద్ఘాటించుతోంది. హిందీ, ఉర్దూమాట్లాడే ప్రజలు గణనీయమైన సంఖ్యలో ఉన్న ప్రాంతాల్లో హిందీ, ఉర్దూభాషల బోధనకు కళాశాలల్లో అవకాశాలుంటాయి

హైదరాబాదు నగరంలో మాదిరిగా, ఉర్దూమాట్లాడే ప్రజలు గల ప్రదేశాల్లో పురపాలక సంఘాల్లోనూ, స్థానిక కోర్టుల్లోనూ దైనందిన కార్యకలాపాలలో హిందీ, ఉర్దూభాషలకు తగిన స్థానం లభించగలదు.

సమైక్య ఆంధ్రరాష్ట్రంలో సాధారణంగా పరిపాలనా నిర్వహణ తెలుగు భాషలో ఉంటుంది. అయితే దరఖాస్తులను ఉర్దూలో వ్రాసినప్పటికీ, వాటిని స్వీకరించి ఆమోదించాలి.

ఉద్యోగాల విషయంలో ఎవనీ కక్షతో పనినుండి తొలగించరాదు. వారిని నిరుద్యోగులుగా చేయరాదు. తెలుగుభాష నేర్చుకొనేందుకు ఉద్యోగులందరికీ అవకాశాలు,సదుపాయాలు కల్పించి వారు తమ ఉద్యోగాలను కొనసాగించుకొనేటట్లు చేయవలెను.

విద్యాశాఖవంటి శాఖల్లో కొందరు ఉద్యోగులకు తెలుగుభాషలో ప్రావీణ్యత వుండకపోవచ్చు. అట్టి ఉద్యోగాలలో తెలుగుభాషా పరిజ్ఞానం వున్న వారినే నియమించవలసిన అనివార్య పరిస్థితులలో తెలుగుభాష రాని ఉద్యోగులను యితర శాఖలకు బదిలీ చేసి, వారి వుద్యోగాలకు గ్యారంటీ కల్పించబడుతుంది.

కొండ తెగలవారి హక్కులు

కోయ, కొండరెడ్డి, గోండు, చెంచు మొదలయిన కొండ తెగలవారి అభివృద్ధికి ప్రత్యేక సౌకర్యాలు కల్గించాలి.

1. వారిని ఇతర ప్రాంతాలనుంచి వచ్చిన వర్తకులు, కాంట్రాక్టర్లు దోచుకోకుండా తగు రక్షణలు కల్పించాలి. వారికి అడవి వస్తువులు ఉచితంగా తెచ్చుకుని అమ్ముకోడానికి హక్కుండాలి. వాటికి న్యాయమైన ధర రాబట్టటానికి, వారికి కావలసిన యితర వస్తువులు కొనుక్కోడానికి కో-ఆపరేటివ్ సొసైటీలను విరివిగా స్థాపించాలి.

2. ఏజెన్సీ ప్రాంతములో ముఠాదారీ విధానం అనే పేరుతో అమలు నందున్న భూస్వామ్య విధానాన్ని రద్దు చేయాలి.

3. ఈ తెగలవారి వ్యవసాయం, విద్య, వైద్య అభివృద్ధికి ప్రభుత్వం ఇతోధికంగా సహాయం చేయాలి. వారి వారి భాషల్లో విద్యాబోధనకు విరివిగా స్కూళ్ళను తెరవాలి.

4. ఏజెన్సీ స్థానిక స్వపరిపాలనా సంస్థల్లో ప్రస్తుతమున్న 'నామినేషన్' పద్ధతిని రద్దుచేసి యితర ప్రాంతాల వలెనే పూర్తి ఎన్నికల విధానాన్ని ప్రవేశపెట్టాలి.

5. పశువులు, గొర్రెలు, మేకలు వగైరాలకు అడవుల్లో మేత సౌకర్యాలు కల్గించాలి.

6. అడవి ప్రాంతాల్లో సెటిల్మెంట్ కాని ప్రదేశాల్లో వెంటనే సెటిల్మెంటు జరిపించాలి.

7. అడవి ప్రాంతాల్లో వ్యవసాయం చేసేవారికి భూములను ఉచితంగాయిచ్చి యిరిగేషన్ సౌకర్యాలు కలిగించాలి.

4. ప్రభుత్వయంత్రంలో మార్పు

1. ఆంధ్ర ప్రదేశంలో పంచాయితీ, జిల్లాబోర్డులకు, మున్సిపాలిటీలకు రహస్య బ్యాలెట్ పెట్టెల ద్వారానే ఎన్నికలు జరపాలి. నామినేషను పద్ధతిని పూర్తిగా రద్దుచేయాలి. పంచాయితీలలో స్త్రీలకు రిజర్వుచేయబడు స్థానాన్ని ఎన్నికల ద్వారా నిలపాలి.

2. ఎన్నుకోబడు జిల్లాబోర్డులను పునరుద్ధరించి, వాటికి కమ్యూనిటీ ప్రాజెక్టులు, జాతీయవిస్తరణ కేంద్రాలు వగైరా అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణాధికారం యివ్వాలి.

3. పరిపాలనా యంత్రాన్ని ప్రజాస్వామికంగా నడుపుటకు పంచాయితీలకు, జిల్లాబోర్డులకుప్రస్తుతమున్న అధికారాలను విస్తృతపరచాలి.

4. మునసబు, కరణాలను వంశపారంపర్యంగా నియమించేపద్ధతినిరద్దుచేసి, యితర వుద్యోగులందరివలెనే వారినికూడా ప్రభుత్వం నియమించాలి. వారి న్యాయమయిన కోర్కెలను అంగీకరించాలి.

5. ఉరిశిక్ష రద్దుచేయాలి.

6. పోలీసు నిర్బంధవిధానం పోవాలి. పోలీసులకున్న అరెస్టు అధికారాలను కుదించాలి. పౌరసత్వ హక్కులభంగం కావించే చట్టాలను, సెక్షనులను రద్దుచేయాలి.

7. ప్రభుత్వ యంత్రాంగంలోని లంచగొండి విధానాన్ని నిర్మూలించాలి. రెడ్ టేపిజంను అరికట్టాలి.

8. చిన్న ఉద్యోగస్థులకు, ఉపాధ్యాయులకు న్యాయమైన జీతాలను నిర్ణయించాలి. ఈ లోపల హైద్రాబాదులోనున్న వేతనాలను తగ్గించకుండా వాటినే ఆంధ్రలోనున్న ఉద్యోగస్థులందరికి కూడ వర్తింపచేయాలి.

9. ఆదాయాలలో వ్యత్యాసాలు తగ్గించడానికి, ఉద్యోగస్తుల జీతాలకు, యితరుల ఆదాయాలకు గరిష్టపరిమితిని ఏర్పాటు చేయాలి.

5. ఆదాయపు వసరులు

1. ఆదాయపు పన్నులో రాష్ట్రాలకు కేంద్రం హెచ్చువాటా యివ్వాలి.

2. కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న అన్ని ఎక్సైజు పన్నులలోను రాష్ట్రాలకు హెచ్చువాటా యివ్వాలి.

3. నైజాం నవాబుకు కేంద్రం చెల్లిస్తున్న భరణాన్ని నిలుపుచేయాలి. అతని నిల్వ ఆస్తులను రాష్ట్రాభివృద్ధి కొరకు పెట్టుబడుల క్రింద సేకరించాలి.

4. జమీందార్లకు, జాగీర్దార్లకు, పెద్ద భూస్వాములకు యిచ్చే నష్టపరిహారాన్ని వాయిదా వేయాలి.

6. విశాలాంధ్ర సరిహద్దులు

కోలారు జిల్లాలో తెలుగు మెజారిటీభాగం, పర్లాకిమిడి ప్రాంతం, మధ్యప్రదేశ్‌లోని సిరివంచ ప్రాంతం మొదలైన ఆంధ్రులు మెజారిటీగానున్న ప్రాంతాలను, దక్షిణబస్తరును విశాలాంధ్రలో చేర్చాలి. సరిహద్దుకమిషన్ ద్వారా మహారాష్ట్ర, కన్నడ, తమిళ, ఒరిస్సా సరిహద్దులను సరిచేసి, యితర రాష్ట్రాలలో ఆంధ్రులు అధిక సంఖ్యలోవున్న ప్రాంతాలను, గ్రామాలను విశాలాంధ్రలోను, విశాలాంధ్రలో యితరులు మెజారిటీగా నున్న ప్రాంతాలను, గ్రామాలను ఆ యా రాష్ట్రాలలోనూ చేర్చాలి.

ఐక్యకృషికి విజ్ఞప్తి

విశాలాంధ్ర సర్వతోముఖాభివృద్ధికి ప్రజారాజ్య స్థాపన అవసరమని ప్రథమ విశాలాంధ్ర కమ్యూనిస్టు మహాసభ భావిస్తున్నది. ఐనప్పటికీ నేటి పరిస్థితులలో యావదాంధ్రదేశపు పురోభివృద్ధికి తోడ్పడగల పైసూచనలు అమలు జరపడానికి కమ్యూనిస్టు పార్టీ శక్తి వంచనలేకుండా పాటుబడుతుందని, ఆంధ్ర ప్రజల శ్రేయస్సు కాంక్షించే పార్టీలు, సంస్థలు,వ్యక్తులు అందరితోనూ హృదయ పూర్వకంగా సహకరించుతుందనీ ఈ మహాసభ స్పష్టం చేస్తూంది. ఆంధ్రదేశపు పురోభివృద్ధిని కాంక్షించే రాజకీయపార్టీలు, ప్రజాసంస్థలు ప్రముఖులు, అందరూ చేయి చేయి కలిపి కృషి చేయబూనుకొమ్మని ప్రథమ విశాలాంధ్ర కమ్యూనిస్టు మహాసభ అర్థించుతున్నది.

లంక సాయుధ బలాల అభివృద్ధి

సత్వరం జరగవలసిన ఆవశ్యకతపై లంక పత్రిక వ్యాఖ్య

కొలంబో, జూలై 9

లంకలోని తన సైనిక స్థావరాలను బ్రిటన్ ఖాళీచేసినట్లే, సైనికంగా లంక కేమీ లోటులేకుండా చేయడంకోసం లంక సాయుధబలాలను త్వరత్వరగా అభివృద్ధి చేయాలని 'సిలన్ డెయిలీ న్యూస్' అనే ప్రముఖపత్రిక హెచ్చరించింది.

లంకలోని బ్రిటిష్ స్థావరాలపై అధికారం లంక ప్రభుత్వానికి దఖలు పరచేందుకు మొన్న లండనులో జరిగిన ఒడంబడిక లంకకు నిజంగా శ్రేయస్కరం కావాలంటే ఇది అవసరమన్నది.

లంకలోని ట్రింకోమలీ, కాటునాయకే కేంద్రాలు ఇక బ్రిటన్ ఆధీనంలో వుండవు కాబట్టి, ముందుముందు బ్రిటన్ ఏదైనా యుద్ధంలో చిక్కుకుంటే దానిఫలితంగా లంకపై శత్రుదాడి జరిగేటట్ల ప్రమాదం తప్పిపోయిందని ఈపత్రిక సంతోషం తెలిపింది. అయినప్పటికీ ఏలాంటి ప్రమాదమూ లేకుండా చేసుకోడానికి లంక తన సాయుధబలాలను తగినంతగా పెంపొందించుకోవలసిన అవసరం ఉందన్నారు.

మరొక ఇంగ్లీషుపత్రిక 'మార్నింగ్ టైమ్స్' లండను ఒడంబడికను గురించి వ్యాఖ్యానిస్తూ, లంకలోని బ్రిటిష్ స్థావరాలు ఇక లంక సొత్తు అయిపోయాయన్నది. అయితే, ఒక్క బ్రిటనుకే కాకుండా ఇతరదేశాల వారికి కూడా ఆ స్థావరాల్లో లంక తాటస్థ్యానికి భంగంకాని విధంగా కొన్ని సౌకర్యాలుంటాయనేది స్పష్టమన్నది.

ప్రజాతంత్ర విధానాన్ని రక్షించేటందుకు లాయర్లు రాజకీయాలలోకి రావాలని లోక్‌సభ స్పీకర్ శ్రీ అనంతశయనం అయ్యంగార్ రాజమండ్రి బార్ కౌన్సిల్లో వుపన్యసించారు.

• • •

పంజాబు విద్యా భూదాన సభకు వచ్చిన 800 మంది వుపాధ్యాయులు తమ జీవితాన్ని సర్వోదయ ఆదర్శ సాధనకై వినియోగిస్తామని ప్రమాణం చేశారు.

నెహ్రూ విధానాలకు ఐర్లాండ్ పత్రికల ప్రశంస

డబ్లిన్, జూలై 8

భారత ప్రధాని నెహ్రూ ఇక్కడ కొంతసేపు విశ్రాంతి తీసుకొని, తరువాత డబ్లిన్ సమీపంలోని అస్లర్ గ్రామానికి వెళ్ళారు. అక్కడ ఒక హోటలులోవుండి రెండురోజులు విశ్రాంతి తీసుకుంటారు.

నిన్నా ఈవేళా ఆయన డబ్లిన్‌లో ఐర్లాండు అధ్యక్షుడయిన సీన్ ఓకెల్లీ భవనంలో గడిపారు. ఐర్లాండులోని బ్రిటిష్ రాయబారి మొదలైన ప్రముఖులు కొందరాయనను దర్శించారు.

ఓకెల్లీ నెహ్రూకు చిన్న విందు కూడా చేశారు.

ఈ విందు తరువాతనే నెహ్రూ, విజయలక్ష్మితో కలిసి అస్లర్ వెళ్ళారు.

అస్లర్‌నుండి నెహ్రూ మంగళవారం డబ్లిన్ తిరిగివస్తారు. ఐర్లాండు జాతీయ విశ్వవిద్యాలయం వారు ఆయనకు 'డాక్టరు ఆఫ్ లా" గౌరవ డిగ్రీని ఇస్తారు.

నెహ్రూ రాకనుగురించి, ఆయన విధానాల విశిష్టతనుగురించి ఐర్లాండు పత్రికలన్నీ మొదటి పేజీల్లో ప్రముఖంగా ప్రచురించాయి.

"నెహ్రూ ఏరాజ్యకూటమితోనూ ముడిపెట్టుకోకుండా తటస్థవిధానం అనుసరించడం ఫలితంగా భారతదేశం ఇప్పుడు ప్రపంచ అగ్రరాజ్యాల్లో ఒకటయింది ఒకప్పుడు అన్నిటికన్నా అగ్రరాజ్యాలుగా ఉండి ఆసియా నంతటినీ పాలించినవాటితో భారత దేశం ఇప్పుడు సమానస్థాయిలో వ్యవహరించగలుగుతూంది.

"నెహ్రూ విదేశాంగ విధానం ఏమయినప్పటికీ, ఆ విధానం ఫలితంగా ప్రపంచంలోని మూడవ రాజ్య కూటమికి భారతదేశం నేడు నాయకత్వం వహిస్తూంది. నేడు ప్రపంచ వ్యవహారాల్లో భారతదేశపు అభిప్రాయాలను గణించక తప్పని పరిస్థితులేర్పడ్డాయ"ని 'సండే ఇండిపెండెంట్' అనే పత్రిక రాసింది.

రష్యా-పాక్ వాణిజ్య ఒప్పందప్రాధాన్యత

కరాచీ, జూలై 8

సోవియట్ యూనియన్‌తో పాకిస్తాన్ ఇటీవల కుదుర్చుకొన్న వాణిజ్య ఒప్పందానికి ఎంతో ప్రాధాన్యం వుందని కరాచీలోని 'న్యూఏజ్' పత్రిక ప్రత్యేక విలేఖరి వ్రాస్తున్నారు.

సోవియట్ వాణిజ్య ప్రతినిధివర్గం నాలుగువారాలపాటు కరాచీలో పాక్ ప్రభుత్వాధికారులతో జరిపిన సంప్రతింపుల ఫలితంగా ఆ ఒప్పందం కుదిరింది. పాకిస్తానీ పారిశ్రామిక వేత్తలు, వాణిజ్యవేత్తలు కూడా ఈ ఒప్పందం కుదరటానికి తోడ్పడ్డారు.

ఈ ఒప్పందం ప్రకారంసోవియట్ యూనియన్ పాకిస్తాన్‌కు అనేకరకాల యంత్ర పరికరాలు, యంత్రాలు, ట్రాక్టర్లు, రసాయనిక పదార్థాలు, పెట్రోలు మున్నగువాటిని ఎగుమతి చేస్తుంది.

అందుకు మారుగా పాకిస్తాన్‌నుంచి జనపనార, జనపనారసరుకులు, ప్రత్తి, ఉన్ని, తోళ్లు, టీ మున్నగు సరుకులు సోవియట్ యూనియన్ దిగుమతి చేసుకోంటుంది.

చైనాకు పాకిస్తాన్ పాత్రికేయుల ప్రతినిధివర్గం

పాకిస్తాన్ పాత్రికేయుల ప్రతినిధి వర్గం ఒకటి ప్రస్తుతం నవచైనాలో పర్యటిస్తున్నది. ఇందులో మతాధికారులుకూడా వున్నారు. ఆ ప్రతినిధి వర్గంలోని వారంతా చైనా సాధించిన పురోభివృద్ధిని ప్రస్తుతిస్తూ స్వదేశంలోని తమ మిత్రులకు జాబులువ్రాస్తున్నారు.

అమెరికాలో ఒక శాస్త్రకారుని దుర్మరణం

రెడ్‌లాండ్స్, జూలై 8

కాలిఫోర్నియా (అమెరికా)లోని రెడ్‌లాండ్స్ సమీపంలో ఒక పరిశోధనా కేంద్రంలో నిన్న దారుణమైన ప్రేలుడు జరిగి బెంజామిన్ కింబ్రిక్ అనే శాస్త్రవేత్త జాడయినా మిగలకుండా భస్మీపటలం అయిపోయాడు.

ఆకాశంలోకి కృత్రిమ ఉపగ్రహాలను పంపడం గురించి పరిశోధనలు జరుపుతున్న కేంద్రమిది. నిన్న ఉన్నట్లుండి మంట బయలుదేరి బ్రహ్మాండమైన ప్రేలుడు జరిగింది.

దూర ప్రాచ్య ఆర్థిక సంఘం కార్యదర్శి

న్యూయార్క్, జులై 8

భారత ప్రభుత్వ ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీ చక్రవర్తి నరసింహన్‌ని ఐ. రా. స. ఆసియా దూరప్రాచ్య ఆర్థిక సంఘానికి కార్యదర్శిగా నియమించినట్లు నేడు ప్రకటించబడింది.

డాక్టర్ పి. యస్. లోకనాథన్ పదవీ విరమణ చేయడంవల్ల, ఆ స్థానంలో శ్రీ నరసింహన్‌ని నియమించారు. ఈయన సెప్టెంబరు 1న పదవీస్వీకారం చేస్తారు.

మోటారు సైకిళ్లపై ప్రపంచ పర్యటన

అలహాబాద్‌కు ముగ్గురు జర్మన్ యువకుల రాక

అల్హాబాద్, జూలై 8

మోటారుసైకిళ్ళపై ప్రపంచపర్యటన జరుపుతున్న ముగ్గురు జర్మన్ యువకులు కలకత్తా వెడుతూ నిన్న యిక్కడికి వచ్చారు.

వారు జర్మనీలో గత డిసెంబరులో తమ పర్యటనను ప్రారంభించి ఇప్పటి వరకూ ఆస్ట్రియా, యుగోస్లోవియా, టర్కీ, సిరియా, జోర్డాన్, ఇరాక్, ఇరాన్, దేశాలను సందర్శించారు.

భారతదేశంలో కాశీ, కలకత్తాలను దర్శించిన తరువాత వారు సింగపూర్‌కు బయలు దేరతారు.

◆

కేంద్ర పాలిత బొంబాయి రాష్ట్రంలో, పశ్చిమ తానాలోని 80 మైళ్ళ చదరపుమైళ్ళ ప్రాంతం అదనంగా కలుస్తుంది. ఈప్రాంతంలో జనసంఖ్య 1 లక్ష 80 వేలు.

రేడియో

జూలై 11 బుధవారము

విజయవాడ

ఉదయం: 7-15 గానసుధ; 7-30 మద్రాస్‌వలె: 12-30 మా॥ విద్యార్థులకు; 1-0 వాద్యగీతి 1-30 గానసుధ; 2-0 వాద్యసంగీతము: నిలయ విద్వాంసుడు; 2-10 ఉ. విద్యార్థులకు; 2-40 వాద్య సంగీతం, నిలయ విద్వాంసుడు; 2-50 ప్రా. విద్యార్థులకు; 5-30 సై. కాతయ్య: క్లారినెట్; 6-15 తుంగభద్రవర్త: జానపదగేయం, వయొలిన్, మనుష్యులకు వ్యాపించే పశువ్యాధుల నివారణ - ప్రసంగం; 7-15 గ్రామస్థులకు, పురాణకాలక్షేపము; 7-30 సై. కాతయ్య: క్లారినెట్; 7-45 రాష్ట్రపరిపాలనా విషయములు ప్రసంగం; 8-0 ఆమ్రపాలి-నాటిక; 8-50 వాద్యగీత్; 9-15 లోకేటి వెంకటేశ్వర్లు: రాగం, తానం, పల్లవి; 10-0 ప్రసార సమాప్తి.

మద్రాసు బి.

ఉదయం: 7-30 రుక్మిణి రంగప్పన్: వీణ; 12-0 కార్మికులకు; 12-30మా.విద్యార్థులకు; 1-0గీతమాలిక; 1-40 గానమంజరి; 2-0 గీతమంజరి; 2-10 విద్యార్థులకు: 2-40 గోటు వాద్యం: నిలయ విద్వాంసుడు; 2-50 ప్రా॥ విద్యార్థులకు; 6-15 గ్రామస్థులకు - తుంగభద్రవర్త: జానపద గేయం, వయొలిన్; 7-15 గ్రామస్థులకు, పురాణ కాలక్షేపము; 8-0 ఆమ్రపాలి - నాటిక; 8-50 వయొలిన్: నిలయ విద్వాంసుడు; 9-15 ఈవారపు కార్యక్రమము వివరణ; 9-30 ఎస్. కోదండపాణి: వేణువు; 10-30 సమాప్తి.

హైదరాబాద్

ఉదయం: 7-15 జయలక్ష్మి సంతానం: కృతులు; 8-30 జీనత్ బేగమ్: ఖయాల్ - తాన్‌పురి; 12-30 వాద్యమాధురి; 1-0 బీగం అఖ్తార్; 1-10 సాహితీ సంపద; 2-45 పాఠశాలల కార్యక్రమము; 5-30 వి. ఇందిరాదేవి: గీతావళి; 6-30 గ్రామసీమ - గ్రామాభ్యుదయము: ములుగు సమాజాభివృద్ధిశాఖ గ్రామసేవక్‌తో పరిచయ ప్రసంగం; 7-15 గ్రామసీమ - పరీక్షిత్తుజన్మం (భాగవతము), పురాణము - సంస్కృత నాటకమున హాస్యరసము; 7-30 కాళిదాసుని శాకుంతలము: (హిందీ) ప్రసంగం; 7-45 హైదరాబాదులో క్రీడారంగం: సమీక్ష; 7-55 సుగమ్‌సంగీత్; 8-0 ఆమ్రపాలి-నాటిక; 8-50 వి. ఇందిరాదేవి: గీతావళి; 9-30 జయలక్ష్మి సంతానం: కృతులు; 10-0 విఠల్ వర్వేకర్: హిందూస్థానీ సంగీతము; 10-30 ప్రసార సమాప్తి.

ధరల పెరుగుదలను అరికట్టే చర్యలు

శ్రీ టి. టి. కృష్ణమాచారి వివరణ

మద్రాసు, జులై 8

దేశవ్యాప్తంగా ఆహారధాన్యాలను బట్టలను వర్తకులు దాచిపెట్టడం జరిగదని, అక్కడక్కడ ధరలు పెరుగుతాయనే ఆశతో ఎవరైనా స్టాకులుదాస్తే దాచుకొవచ్చునని కేంద్ర పరిశ్రమల మంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి నేడిక్కడ అన్నారు.

పారిశ్రామికదారులు, వ్యాపారస్థులు, జర్నలిస్టులు గల సమావేశంలో వర్తకులు స్టాకులు చేయడంవల్లనే ధరలు పెరిగాయంటారా, అని శ్రీ కృష్ణమాచారిని ప్రశ్నించగా, ఆయన జవాబుచెబుతూ, ధరలు ఉధృతంగా పెరుగుతున్నాయని తాను అంగీకరించనన్నారు. అక్కడక్కడా ధరలు పెరిగివుండవచ్చునని, వాటిని అదుపులోకి తీసుకువస్తామని అన్నారు.

నిరుడుఆహారధాన్యాలు, వ్యాపార పంటల ధరలు పెరిగాయి. వ్యవసాయదారులకు నష్టం వస్తోందనే ఆందోళన బయలు దేరింది. వ్యాపార పంటల విషయంలో, ముఖ్యంగా నూనె విత్తులను తీసుకొన్నట్లయితే, ఒక ఏడు ఎక్కువ పండితే, రెండోఏడు తక్కువ పండుతుంది ఇది అందరికీ తెలిసినవిషయమే. ఈ ఏడాది ప్రాథమిక సరకుల ధరలు, రెండేళ్ళ క్రితం వున్న స్థాయికి చేరాయి అని శ్రీ కృష్ణమాచారి చెప్పారు.

ధరలను అదుపులోకి తీసుకరావడానికే, బర్మానుంచి 20 లక్షల టన్నుల బియ్యం దిగుమతి చేయడానికి సంకల్పించామన్నారు. ఈ బియ్యానికి సబ్సిడీ ఇచ్చి అమ్మించవలసివుంటుందన్నారు.

ధరలు పెరుగుతున్న ధోరణి ఏమాత్రం కనపడినా దాన్ని వేచి చూడవలసిన అవసరం వుంటుందని, ప్రణాళికాబద్ధమైనఆర్థిక వ్యవస్థ,బుణ ప్రస్తద్రవ్యవిధానం వున్నపుడు ఇది మరీ ముఖ్యమని అన్నారు. అయితే ఇప్పట్లో ధరల పెరుగుదలను గురించి తనకు ఆందోళన లేదన్నారు.

నూలుధరలపెరుగుదలకు పత్తిధరలు పెరుగుదల కారణమని శ్రీ కృష్ణమాచారి అన్నారు. అమెరికన్ పత్తిధర తగ్గిపోతుండగా, అతి సున్నితమైన ఈజిప్షియన్ పత్తిధరలు పెరిగిపోతున్నవన్నారు. సోవియట్ యూనియన్ ఈజిప్ట్ మార్కెట్‌లో ప్రవేశించడం ఇందుకు కారణమన్నారు. అయితే పత్తి డిమాండును, సప్లయికి సరిపోతున్నదని ప్రభుత్వం చర్య తీసుకోవలసిన తరుణం ఇంకా ఆసన్నం కాలేదని అన్నారు. నూలుధరతోపాటు బట్టలధరకూడా పెరిగిందని ఇందువల్ల చేనేతవస్త్రాల ధరకూడా హెచ్చిందని అన్నారు.

ధరలు ఎప్పుడుతగ్గుముఖంపడతాయి అన్న ప్రశ్నకు, "మన మిగులు చాల తక్కువగా వుంది. ఇది హెచ్చునంతవరకూ, ధరల పెరుగుదల అనివార్యమవుతుంది" అని అన్నారు.

బెంగాల్ - బీహార్ల సంలీనం

ఇప్పటికీ తమకుసమ్మతమేనని బీహార్ ముఖ్యమంత్రి వెల్లడి

రాంచీ, జూలై 7

పశ్చిమ బెంగాల్ - బీహారులు కలసి ఒకే రాష్ట్రంగా ఏర్పడాలన్న నిర్ణయానికి బీహార్ ఇప్పటికీ దృఢంగానే నిలబడివున్నదని బీహార్ ముఖ్యమంత్రి శ్రీ కృష్ణసిన్హా నేడు బీహార్ శాసనసభలో మాట్లాడుతూఅన్నారు.

బెంగాల్ - బీహార్ బిల్లుపై శాసనసభలో మూడు రోజులుగా జరుగుతున్న చర్చకు ముఖ్యమంత్రి సమాధానం చెపుతూ యింకా యిలా అన్నారు:

"బహుభాషా రాష్ట్రాలను నిర్మించినప్పుడే భారతదేశాన్ని ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారం కాగలవు. బెంగాల్ బీహార్ రాష్ట్రాలు కలసి ఒక రాష్ట్రంగా ఏర్పడినప్పుడే ఇప్పుడున్న అనుమానాలు, సందేహాలు, ద్వేషాలు పోతాయి."

రాష్ట్రాల కమిషన్ నిర్ణయాలకు వ్యతిరేకంగాబీహార్‌లో ప్రజలను రెచ్చగొట్టారన్న ఆరోపణను శ్రీ కృష్ణసిన్హా ఖండించారు. ప్రజలను పశువుల వలె పరిగణించి, వారి యిష్టాయిష్టాలతో నిమిత్తంలేకుండా ఒక రాష్ట్రం నుండి మరొక రాష్ట్రానికి బదిలీ చేయరాదన్నారు. అలాచేస్తే అసంతృప్తి, నిస్పృహలు కలకాలంగా నిలిచి ఉభయరాష్ట్రాలకు తీరని హాని కలుగుతుం దన్నారు.

బీహార్ ప్రజలు తమకు అన్యాయం జరిగిందని చాల బాధతో కృంగిపోతున్నారనీ, ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమూ, కాంగ్రెసు అధిష్టాన వర్గమూ గుర్తించాలని ఆయనకోరారు.

రాష్ట్రాల పునర్నిర్మాణ సమస్యపై కేంద్ర ప్రభుత్వం చేసిన నిర్ణయానికి అసమ్మతిగా రాష్ట్ర మంత్రివర్గం రాజీనామా చెయ్యాలన్న కొందరి సభ్యుల సూచనను తాను ఆమోదించలేనని శ్రీ కృష్ణసిన్హా అన్నారు. తమ కోర్కెలను అంగీకరించలేదనే కారణంతో పశ్చిమబెంగాల్, ఒరిస్సా శాసనసభ్యులురాజీనామాయిస్తే ఏమవుతుందని ఆయన ఎదురు ప్రశ్నించారు. ఏదిఏమైనా భారతదేశఐక్యతనుకాపాడవలసిందేనన్నారు. అయితే బీహార్‌కు జరిగిన అన్యాయాన్ని గురించి ఇక్కడ వున్న తీవ్ర అసంతృప్తిని కేంద్రానికి తెలియపరచగలనని హామీ యిచ్చారు.

పోజ్నాన్ అల్లర్ల వెనుక సామ్రాజ్య వాద ఏజంట్ల పాత్ర

'న్యూ ఏజ్' విలేఖరి డేవిడ్ కోహెన్

వార్సా, జూన్ 30

పోజ్నాన్‌లో ఇటీవల జరిగిన అల్లర్ల వెనుక సామ్రాజ్యవాదముఠాల ప్రోత్సాహం, అభివృద్ధి నిరోధక రహస్య ముఠాల ప్రోద్బలం ఉన్నట్లు పోలండ్ ప్రభుత్వంవద్ద సాక్ష్యాధారాలు ఉన్నాయి.

సుమారు 35 దేశాలు పాల్గొంటున్న అంతర్జాతీయ ప్రదర్శనం పోజ్నాన్‌లో జరుగుతున్న సమయాన్ని అనుకూలంగా తీసుకొని సామ్రాజ్యవాద ఏజంట్లు ఈ అల్లర్లను లేవదీశారు. ఈ ప్రదర్శనం చూడడానికి 3000 మంది పారిశ్రామికులు, జర్నలిస్టులు వచ్చారు. సుమారు 600 మంది ప్రదర్శనలలో తమ సామాగ్రిని ఉంచారు.

అల్లర్లు జరిగిన రోజున ప్రదర్శనలను చూచేవారితో ఇతర పోలిష్ నగరాలనుండి అనేకమంది పోజ్నాన్ చేరినట్లు ఒక ఆస్ట్రియన్ వ్యాపారస్తుడు ఆ మరుసటి రోజున బెర్లిన్ వచ్చి చెప్పాడు. ఈవిధంగా వచ్చిన వారిలో రహస్య ముఠాలకు చెందిన వారున్నారు.

కార్మికుల జీతాల సమస్య

పోలండ్ ప్రధాని సిరంకివిజ్ అల్లర్లు జరిగిన మరుసటి రోజున పోజ్నాన్‌లో మాట్లాడుతూ, కొన్ని పారిశ్రామిక సంస్థలలో జీతాల విషయంలో కార్మికులకు అసంతృప్తి ఉన్నదనీ, దీనిని రహస్య ముఠాలు వినియోగించుకొని అల్లర్లు లేవదీశారన్న విషయం మరుగుపరచవసరం లేదనీ ప్రకటించారు.

పోలండ్ ఐక్య కార్మికపార్టీపత్రిక "ట్రిబ్యూనా లుడు"పోజ్నాన్ అల్లర్లను గురించిన వివరాలు తెలియజేస్తూ స్థానికంగా ఉన్న ఒక రైలు ఇంజన్ల, పనిముట్ల ఫ్యాక్టరీ- జిస్పోలో కొన్ని తరగతుల కార్మికులకు మిగిలిన వారికంటె తక్కువజీతాలు యిస్తున్నారనీ, అందువలన వారిలో అసంతృప్తి బయలుదేరిందనీ, అసలు పోజ్నాన్ ప్రదర్శనలకు ఇది మూలహేతువని తెలియజేసింది.

కార్మిక ప్రతినిధులు 30 మంది ప్రభుత్వంతో కార్మిక సమస్యలను చర్చించడానికి వెళ్లిన అదును కనిపెట్టి విద్రోహులు ఈ అల్లర్లను రెచ్చగొట్టారు. పనిపద్ధతులు మార్చాలనీ, జీతాలపై పన్నులు తగ్గించాలనీ వీరు కోరారు. వెంటనే ఆచరణ సాధ్యమైన కోర్కెలను తీరుస్తామని ప్రభుత్వం చెప్పింది.

పోలండ్‌లో సమ్మెలపై నిషేధం లేదు. ఆరునెలల క్రితమే ఒక బట్టల మిల్లులో ప్రశాంతంగా సమ్మె జరిగింది. కార్మికుల కోర్కెలంగీకరించబడటంతో ముగిసింది.

కాని పోజ్నాన్‌లో జూన్ 28వ తేదీన మున్సిపాలిటీ యెదుట కార్మికులు చేసిన ప్రదర్శనలలో విద్రోహులు జొరబడ్డారు. మరతుపాకులు, రైఫిళ్ళతో దాడి ప్రారంభించారు.

రక్షణశాఖపోలీసుల ప్రమత్తత

పోస్టాఫీసు, రైల్వేస్టేషన్, కోర్టులు, ప్రాసిక్యూటర్ ఆఫీసు, జైలు మొదలైనవాటిపై పడ్డారు. జైలులోని ఖైదీలను ఇవతలికి తీశారు. రౌడీగ్యాంగులను కలుపుకున్నారు. తరువాత రక్షణశాఖ కార్యాలయం మీదకువచ్చారు. ఇక్కడ మొదటి శ్రేణిలో పిల్లలను నిలబెట్టి మరతుపాకి కాల్పులు ప్రారంభించారు.

రక్షణశాఖ పోలీసులు హెచ్చరికగా గాలిలో కాల్పులుచేసి చాల సేపటివరకు ఖచ్చితమైనచర్య ఏదీ తీసుకోలేదు. ప్రదర్శనలో విద్రోహుల ముఠాచేరిన సంగతి తెలుసుకోక, మామూలు కార్మికుల సమ్మె అని భావిస్తూ ప్రదర్శనలలో జోక్యం కల్గజేసుకోలేదు.

అల్లర్ల వెనుక ఉన్న దెవరో తెలిసిన తోడనే రక్షణశాఖ పోలీసులు చర్య తీసుకున్నారు. 28వ తేదీ రాత్రంతా విద్రోహ ముఠా ఇండ్ల కప్పుల మీదనే ఉన్నారు. 29 ఉదయాన కాని తిరిగి ప్రశాంత పరిస్థితులను నెలకొనలేదు. అప్పుడు తిరిగి పట్టణంలో రాకపోకలు మళ్ళీ సాగాయి. దోచుకోబడిన సాపులను తిరిగి తెరిచారు.

పోజ్నాన్ కార్మికుల వద్ద ఆయుధాలు లేవు

అరెస్టుచేయబడిన వారి వద్ద సోదా చేయగా బయటనుండి సహాయం కోరుతూ వ్రాసిన ఒక టెలిగ్రాము దొరికింది. ఆయుధాలు కల్గి ఉన్న కార్మికులను పరిశీలించగా వారు పోజ్నాన్ కార్మికులుకారని తేలింది. దీనిని బట్టి బయటనుండి సాయం అందినట్లు తేలింది. రైలు ఇంజన్ల ఫ్యాక్టరీ కార్మికు లెవరివద్దా ఆయుధాలు లేవు. ఆయుధాలుపయోగించాలని వారు ఎప్పుడూ అనుకోలేదు.

కాని ప్రదర్శకులలో వున్న వారిలో దిట్టంగా ఆయుధాలను చేతబట్టుకున్న వారున్నారు. అరెస్టు చేసిన తరువాత వీరిలో రహస్య ముఠాకు చెందినవారున్నట్టు తేలింది.

అల్లర్లు ఒక ప్రక్కన జరుగుతుండగా పోజ్నాన్ రేడియో స్టేషన్ వద్దకు కొందరు కార్మికులు వచ్చి ప్రభుత్వ భవనాలను విధ్వంసం చేయవద్దని కార్మికులకు విజ్ఞప్తిచేయ నివ్వవలసిందని కోరారు. దీనిని బట్టికూడా పోజ్నాన్ కార్మికులు అల్లర్లు సాగించడానికి అనుకూలంగా లేరని తేలింది.

కార్మికులు ప్రదర్శన సాగించుతున్నప్పుడు అందులో దుండగులు చేరినసంగతి తెలియదు. అల్లర్లు లేవదీయాలని ఈ దుండగులు సంకల్పించిన సంగతీ తెలియదు.

1953 జూన్‌లో తూర్పు జర్మనీలో అల్లర్లు ఏవిధంగా జరిగాయో సరిగ్గా అదేవిధంగా పోజ్నాన్ అల్లర్లు కూడా సాగాయి.

ప్రధాని సిరంకివిజ్ మాట్లాడుతూ ఈ అల్లర్లవలన పోలండులో సాగుతున్న ప్రజాస్వామికీకరణ ఆగిపోదని ప్రకటించారు. సామ్రాజ్యవాద ఏజంట్లు ఈ ప్రజాస్వామికీకరణకు వ్యతిరేకంగానే ఈ అల్లర్లు ప్రారంభించి ఉండడంవలన ఈ ప్రకటనకు చాల ప్రాముఖ్యత ఉన్నట్లు ఎంచుతున్నారు.

'ట్రిబ్యూనాలుడు' పత్రిక ఈఅల్లర్లు విద్రోహులు రెచ్చగొట్టినవేనని స్పష్టీకరించింది. పోజ్నాన్ కార్మికులకుగల యిబ్బందులను అవకాశంగా తీసుకొని ఈ పని చేశారని తెలిపింది. ఈ పత్రిక ఇంకా ఇలా వ్రాసింది.

"మన ఆర్థిక పరిస్థితులు బాగాలేని మాట నిజం. అనేక సమస్యలను ఇంకా పరిష్కరించవలసిఉంది. కొన్ని సమస్యల పరిష్కారంలో చాలా ఆలస్యం అవుతూంది.

పార్టీ, ప్రభుత్వమూ రెండూ ఈ అన్ని విషయాల్లోను తీవ్రంగా కృషి చేస్తూంది. కొన్ని నిర్ణయాలను అమలు జరిపారుకూడా.

అల్లర్ల సందర్భంలో అరెస్టు చేసిన అనేకమందిని విడుదల చేశారు. పౌరుల చట్టబద్ధ హక్కులను రక్షించడానికి తగుచర్యలను తీసుకున్నారు. న్యాయబద్ధమైన అవకాశాలను కల్పించాలని, వేతనాలను క్రమబద్ధంచేసి వీలైనంతవరకు పెంచడానికి పూనుకున్నారు.

అయితే ఒక్కసారిగా ఆర్థిక పరిస్థితులను బాగుచేయడానికి సాధ్యం కాదు. అందుకు కొంతకాలం పడుతుంది.

అయినప్పటికీ శత్రువులుయీఅదను చూసుకుని అల్లర్లు లేవదీయడానికి పూనుకున్నారు.

ప్రజలు, పార్టీ, ప్రభుత్వం ఆర్థిక పరిస్థితిని బాగుచేసి, ఉత్పత్తిని పెంచడానికి, ఆ విధంగా పురోభివృద్ధి సాధించాలని అభిలషిస్తున్నారు.

ఈ అల్లర్లు రెచ్చగొట్టినవారు చెడ్డను మంచిగా మార్చడానికి, ప్రజల పరిస్థితులను బాగుచేయడానికి ఉద్దేశించలేదు. ఉన్న పరిస్థితులను పాడుచేయడానికి, మరింత అధోగతిని తీసుకురావడానికి సంసిద్ధపడ్డారు.

ప్రజలు, పార్టీ, ప్రభుత్వము కూడా తమ నిశ్చిత పంథానుండి ఏమాత్రం వైదొలగకుండా ముందుకే సాగుతారు. ఆర్థిక పరిస్థితులను బాగుచేయడానికి, ఉత్పత్తిని పెంచడానికి కృషిచేస్తారు. ఈపంథాయే దేశ పురోగతిని సాధిస్తుంది.

ఈఅల్లర్లను లేవదీసి దేశానికంతకూ నష్టం కల్గించినవారి ఆటలు ఎంత మాత్రం ప్రభుత్వం సాగనీయదు.

అదే సమయంలో అల్లర్లను రెచ్చగొట్టినదెవరో, పోజ్నాన్ కార్మికు లెవరో ప్రభుత్వం అతి జాగ్రత్తగా గమనిస్తుంది."

ఐ. రా. స. విజయం పట్ల రష్యా ఆసక్తి

హామర్షెల్డ్ విశ్వాసం

న్యూఢిల్లీ, జూలై 7

ఐ. రా. స. సఫలీకృతం కావడానికి సోవియట్ ప్రజలు ఎంతైనా తోడ్పడగలరని, సోవియట్ ప్రభుత్వమూ, ప్రజలూ అందుకు తప్పకుండా తోడ్పడతారన్న విశ్వాసంతోనే తాను మాస్కో వచ్చాననీ, వచ్చి ఇక్కడ జరిపిన సంభాషణల ఫలితంగా ఆ విశ్వాసం బలపడిందనీ, ఐ. రా. స. కార్యదర్శి హామర్షెల్డ్ మాస్కో టెలివిజన్ ప్రసారంలో ప్రసంగించారు.

సోవియట్ వార్తాసంస్థ టాస్ ఈ ప్రసంగాన్ని ప్రచురించింది.

ఐ. రా. స. పట్ల అసమగ్రసంస్థ అని కొందరు విమర్శిస్తూ ఉంటారని ఆయన ఆ ప్రసంగంలో అన్నారు. ఆ సంస్థ వుండడంవల్ల ప్రయోజనం ఏమైనా వుందా అని కొందరు అడుగుతుంటారన్నారు. ఐతేదానిఉపయోగ, నిరుపయోగాలు ఆయా ప్రభుత్వాల వైఖరినిబట్టి ఆధారపడి ఉంటాయన్నారు.

ఐ. రా. స. విజయం సోవియట్ ప్రజల ప్రయోజనాలకు అవసరమన్నారు.

పంచాయితీబోర్డు ఎన్నికల ఫలితాలు

తణుకు, జూలై 8

తణుకు తాలూకా పంచాయితీ బోర్డుకు శ్రీయుతులు జిడ్డు సూర్యనారాయణ, రామాయణం పురుషోత్తం, బసవా వెంకటరత్నం, కాకరపర్తి వెంకటపతి, బండుల రామన్న, ఖండవిల్లి చిన పల్లియ్య, ఖండవిల్లి కాంతారావుగార్లు ఎన్నికయారు.

ఉప్పలపాడు

బాపట్ల తాలూకా ఉప్పలపాడు పంచాయితీబోర్డుకు శ్రీయుతులు నాగిశెట్టి నాగేశ్వరరావు, ఈదర వెంకయ్య, బాలినేని సుబ్బారావు, ఇంటూరి అబ్బయ్య, పరిటాల వెంకటేశ్వర్లు, కొప్పుల మనోహరం (6), కనపర్తి వెంకటేశ్వర్లు, మారెళ్ళ సత్యనారాయణగార్లు ఎన్నికయారు.

వీరిలో సత్యనారాయణగారు కాంగ్రెసు అభ్యర్థి. మిగతావారు కమ్యూనిస్టులు. కాంగ్రెసు ఏడు స్థానాలకు పోటీ చేసింది. కమ్యూనిస్టు పార్టీ మొత్తం ఎనిమిది స్థానాలకు పోటీ చేసింది.

శ్రీ సభ్యురాండ్ర ఎన్నిక

ఉప్పలపాడు పంచాయితీకి శ్రీమతి కొల్లా రత్నమ్మగారు శ్రీసభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికయారు.

ఇదేవిధంగా కందుకూరు తాలూకా ముప్పవరం పంచాయితీకి కమ్యూనిస్టు పార్టీ సానుభూతిపరురాలు శ్రీమతి సుద్దపల్లి వెంకట సుబ్బమ్మగారు శ్రీ సభ్యురాలిగా ఎన్నికయారు.

ఆంధ్ర విద్యాపరిషత్ వార్షికోత్సవం

ఈ నెల 14 వ తేదీన విజయవాడలో

విజయవాడ, జూలై 8

ఆంధ్ర విద్యాపరిషత్ వార్షికసభలు ఈ నెల 14వ తేదీ సాయంత్రం గం 4 లకు విజయవాడలో జరుగుతాయని, అన్ని జిల్లాల్లోని విద్వాంసులు, హైస్కూళ్ళలోని పండితులు మహాసభలో విరివిగా పాల్గొనాలని పరిషత్ కార్యదర్శి శ్రీ వల్లూరి వెంకటసుబ్రమణ్యంగారు ప్రకటిస్తున్నారు.

తోలు, పీచు పరిశ్రమలకు అదనపు ధన సహాయం

న్యూఢిల్లీ, జూలై 9

తోలు, పీచు పరిశ్రమల అభివృద్ధి కోసమని అఖిల భారత ఖాదీ గ్రామ పరిశ్రమల బోర్డుకు ఆంధ్ర, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాలకు ఇండియా ప్రభుత్వం విరాళాల రూపంగానేమి, రుణాల రూపంగానేమి, 20,31,000 రూపాయిలు మంజూరు చేసింది.

ఇందులో గ్రామీణ చర్మకార పరిశ్రమ అభివృద్ధికి సుమారు రు.6,42,000 కేటాయించబడింది. తోళ్ళు, పదునుచేసిన తోళ్ళు, తోళ్ళతో తయారు చేసిన వస్తువులూ విక్రయించే నిమిత్తం పెద్దవి చిన్నవి 25 విక్రయశాలలు నెలకొల్పబడ్డాయి. ఈవిక్రయశాలలను నెలకొల్పడానికి సహకార సంస్థలకూ నమోదైన సంస్థలకూ చట్టబద్ధమైన రాష్ట్ర బోర్డులకు విరాళాలుగా రూ. 1,92,000 రుణాలుగా రూ. 3,75,000 పంపకం చేయబడతాయి. ఈ డబ్బుతో విక్రయశాలలకు నిర్వహణ వ్యయం, పెట్టుబడి వ్యయం సమకూర్చబడింది.

ఆంధ్ర రాష్ట్రంలో వంటకు ఉపయోగించని నూనెలతో సబ్బు తయారు చేసే పరిశ్రమను అభివృద్ధి చేయడానికి 18,375 రూపాయలు మంజూరు చేయబడింది.

భారతదేశంలో పత్తిపంట ఉత్పత్తి

బొంబాయి, జూలై 6

భారతదేశంలో 1954-55వ సంవత్సరంలో ఒక కోటీ 83 లక్షల ఎకరాలలో పత్తిపంట వేయబడింది. అంతకు పూర్వపు సంవత్సరంలో పత్తి పంట విస్తీర్ణం ఒక కోటీ 72 లక్షల ఎకరాలు మాత్రమే. అధికార అంచనాల ప్రకారం 1954-55లో 42 లక్షల 68 వేల బేళ్ళ పత్తి ఉత్పత్తి చేయబడింది. అంతకు పూర్వసంవత్సరంలో 36 లక్షల 65 వేల బేళ్ళ పత్తి మాత్రమే ఉత్పత్తి అయింది.

బీహారు వరదల తగ్గుముఖం

పాట్నా, జూలై 7

బీహారు వరదలు తగ్గుముఖం పట్టాయి. కాని కోసీ, కమలబలన్ నదుల ఒడ్డున ఉన్న వేలాది ఎకరాల భూమిమాత్రం ఇంకా నీటిలో మునిగే ఉన్నది. ఈ ప్రాంతంలో 45 వేల ప్రజలు జీవిస్తున్నారు.

25 మంది డాక్టర్లు, 30 మంది ఆరోగ్య శాఖా ఉద్యోగులు 3 లక్షల ఖరీదు గల మందులతో వరదబాధిత ప్రజలకు సహాయం అందచేస్తున్నారని ప్రభుత్వ వర్గాలవారు అంటున్నారు.

మద్రాసు నగరంలో పచ్చి బియ్యం అమ్మకం

మద్రాసు, జులై 7

తమ గిడ్డంగుల్లో నుంచి పచ్చి బియ్యాన్ని తక్షణమే ఇండియా ప్రభుత్వం మణుగుకు 16 రూ.ల చొప్పున విడుదల చేయడానికి నిర్ణయించినట్లు ఈవేళ అధికారరీత్యా ప్రకటించబడింది. ఒకే దఫా కనీసం 30 మణుగులకంటె తక్కువ విడుదల చేయబడదు; 62 మణుగులకంటె ఎక్కువ విడుదల చేయరు. బియ్యం కొనుక్కున్న వర్తకుల ధరావత్తుతో పాటు దరఖాస్తులు పంపవచ్చును. దక్షిణప్రాంతీయ ఆహార డైరెక్టరు పేరిట పంపాలి. ఆహార డైరెక్టరు చిరునామా ఇది: ప్రాంతీయ ఆహార డైరెక్టరు, దక్షిణ ప్రాంతం, మంగళవిలాస్, 20, లజ్ ఎవెన్యూ, మైలాపూర్, మద్రాసు-4.

నేపాలీనాయకులకు ఆకాశరామన్న జాబు

ప్రాణం తీస్తామని బెదరిస్తూ

ఖాట్మండూ, జూలై 8

నేపాళీప్రధానమంత్రి శ్రీ టంకాప్రసాద్ ఆచార్య, నేపాలీ జాతీయ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ డిల్లీ రామన్ రెగ్మే, శ్రీ బి. పి. కోయిరాలాలను బెదిరిస్తూ ఎవరో ఆకాశరామన్న వుత్తరాలు వ్రాసినట్లు పోలీసులద్వారా నేడు తెలియవస్తున్నది.

"మీరు బ్రతికి వున్నంతకాలం దేశంలో అభ్యుదయం, శాంతి, న్యాయం సాధ్యంకావని మా అభిప్రాయం. కనుక మిమ్మల్ని కాల్చి చంపటమో, పొడిచి చంపటమో, తప్పనిసరి అవుతోంది. కాలం మించుకొస్తోంది" అంటూ ఆ లేఖల్లో పేర్కొనబడింది.

ఆ లేఖలు ఆంగ్ల భాషలో టైపు చేయబడివున్నాయి.

లేఖలు

ఖమ్మం ఆస్పత్రిలో లేడీడాక్టరు ధనాశ

మహాశయా!

జిల్లాకు కేంద్రమైన ఖమ్మం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో లేడీడాక్టరు ధనాశ రోజురోజుకూ మితిమీరుతున్నది. ఇటీవల బురాణపురం గ్రామానికి చెందిన ఆకారపు దుర్గమ్మ అనే నిరుపేదరాలు ప్రసవవేదనలో బాధపడుతుండగా నేను ఆస్పత్రికి తీసుకెళ్ళాను. లేడీడాక్టరు చూచి "రు 80/-ల విలువచేసే రక్తపు మందు వాడాలి; డబ్బు తెమ్మని" చెప్పింది. ఆ మందుపేరు చీటీమీద వ్రాసి ఇమ్మని నేను అడిగాను. దాంతో తనకేమీ డబ్బు గిట్టుబాటు కాదని ఉద్రేకపడి. "ఈ కేసు ఇచ్చట నయంకాదు; బెజవాడ తీసికెళ్ళ"మని చెప్పింది. ఏమీ పాలుపోక చివరకు స్థానిక మిషన్ ఆస్పత్రిలో చేర్పించగా "రక్తపు మందు" లేకుండానే సుఖంగా ప్రసవించింది. తల్లీ, పిల్లా ఖులాసాగా ఉన్నారు.

ఇదే గ్రామానికి చెందిన కాంపాటి కనకమ్మ అనే మరో స్త్రీ విషయంలో కూడా ఆపరేషను చేయాలని, ఆపరేషను చేసేనంత్యాగ తల్లీ, శిశువు - ఇద్దరూ చనిపోయే ప్రమాదం ఉందనీ లేడీడాక్టరు భయపెట్టింది. డబ్బు ఆశచూపకపోయేసరికి మూడు గంటల తర్వాత వచ్చి "ఈకేసు సాధ్యపడదు; వెళ్ళిపొమ్మని" లేడీడాక్టరు నిష్కర్షగా చెప్పివేసింది.

పేరుకుఇది ధర్మాసుపత్రే అయినా డబ్బులేనిదేపనిజరగడంలేదు. పైరెండు ఘటనలను గురించి ప్రభుత్వం విచారణ జరిపి ఈ లేడీడాక్టరునుపై తగు చర్య తీసుకోవలెనని కోరుతున్నాను.

వట్టికొండ లక్ష్మీకాంతయ్య,
ఖమ్మం.

"కుల వ్యవస్థను రూపుమాపాలి"

కేంద్రమంత్రి జగ్‌జీవన్‌రామ్ ఉద్ఘాటన

భతిండా (పెప్సూ), జూలై 8

కుల వ్యవస్థకు, సోషలిస్టు తరహా సమాజానికి ఏమాత్రం పొసగదని కేంద్ర రవాణాశాఖామంత్రి శ్రీ జగ్‌జీవన్‌రామ్ నేడిక్కడ జరిగిన హరిజన రాజకీయ మహాసభను ప్రారంభిస్తూ స్పష్టం చేశారు.

భారతదేశంలోని కులవ్యవస్థను రూపుమాపకుండా, సామ్యవాదాన్ని స్థాపించవచ్చునని ఎవరైనా అనుకొంటే, అలాంటివారంతా ఆత్మవంచనకు, పరవంచనకు పాల్పడుతున్నారన్నమాటేనని ఆయన పేర్కొన్నారు.

'ధనం మూలం ఇదం జగత్' అన్న దృక్పథాన్ని మార్చివేయాలనీ, రాజకీయ స్వాతంత్ర్యం సాధించటానికి చేసిన త్యాగాలకన్నా, ఆర్థిక స్వాతంత్ర్యసాధనకు చేయవలసిన త్యాగాలు ఎక్కువగా వుంటాయనీ శ్రీ జగ్‌జీవన్ రామ్ వివరించారు.

సమాజంలోని ప్రతివ్యక్తి ఉన్నతస్థితికి చేరుకొనేందుకు అవసరమయిన అవకాశాలను అందరికీ కలుగచేయడమే సామ్యవాదం అని ఆయన నిర్వచించారు. ప్రస్తుతదశలోసంపదను పంపిణీ చేయటం అంటే పేదరికాన్ని పంపిణీ చేయటమేనని అంటున్నవారిని శ్రీ జగ్‌జీవన్ రామ్ విమర్శించారు. ఒకవేళ పేదరికాన్ని పంపిణీ చేయటమే అవుతుందని వాదనకోసం అంగీకరించినా అందులోకూడా చెడు ఏమీలేదని ఆయన అన్నారు.

బజారు ధరలు

విజయవాడ, జులై 8
(మధ్యాహ్నం గం. 1 వరకు)

బంగారం ధరలు

మేలిమి పాట్లా	102	0	0
మూసా	101	0	0
నవరసు 68 0 0 జాబ్జి	67	0	0
వెండి 100 తులములు	172	0	0
1 తులము	1	12	6

ధాన్యం ధరలు

24 నెంబరు	25	0	0
వంకసన్నాలు	23	12	0
12 నెంబరు	22	12	0
అక్కుళ్ళు	22	12	0
కుసుమ	22	8	0
కొణామణి	22	8	0

బియ్యం ధరలు

24 నెంబరు	60	0	0
వంకసన్నాలు	54	8	0
12 నెంబరు	53	0	0
అక్కుళ్ళు	53	0	0
కుసుమ	51	8	0
కొణామణి	52	0	0

అపరాల ధరలు

మినుములు 240 శే॥	59	8	0
కందులు	36	0	0
నల్లపెసలు(మాగాణి)	44	0	0
పచ్చ పెసలు(మెట్టవి) 40/-	41	0	0
పచ్చపెసలు (మాగాణి)	41	0	0
సెనగలు (దేశవాళీ)	39	0	0
సెనగలు (పంజాబు)	36	0	0
ధనియాలు 90 సోనులు	34	0	0
ఉలవలు	32	0	0
ఆముదాలు	39	0	0
పంచదార (ఉయ్యూరు)	91	6	0
మిర్చి పైఠాం 18/-	20	0	0
మిర్చి దేశవాళీ	26	0	0
బెల్లం ట్లి ,, 6/-8	7	0	0
చింతపండు(మణుగు) 5/-	6	4	0
కొబ్బరినూనె డబ్బా	25	4	0
వేరుసెనగపప్పు177	56	8	0
,, నూనె మణుగు	15	14	0
,, కేక్ 160 శే॥	15	14	0
,, మడ్డిపిండి 160 శే॥	18	0	0
కొబ్బరికాయలు 1000	123	0	0
పసుపు ఫుట్టి	160	0	0
సంచులు 100	98	0	0

హిందూ-సిక్ ఐక్యత

మాస్టర్ తారాసింగ్ ప్రసంగం

అమృతసర్, జూలై 8

దేశ స్వాతంత్ర్యాన్ని పదిలపర్చాలంటే పంజాబులోని హిందువులకు, సిక్కులకు మధ్య ఐకమత్యం సాధించటం ఎంతో అవసరమని శిరోమణి అకాలీదళ్ నాయకుడు మాస్టర్ తారాసింగ్ నేడిక్కడ జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ వక్కాణించారు.

మహాపంజాబ్ సమితివారు సాగిస్తున్న ఆందోళనోద్యమానికి తమ నిరసనను వ్యక్తం చేసేందుకు అకాలీలు ఆసభను ఏర్పాటు చేశారు.

హోషియాపూర్‌లో ఇటీవల జరిగిన పోలీసు అత్యాచారాలను గురించి ప్రస్తావించి, అన్ని పార్టీలతో కూడిన విచారణసంఘం హోషియాపూర్ ఘటనలపై దర్యాప్తు జరిపితే సరిపోతుందని మాస్టర్ తారాసింగ్ సూచించారు.

కమ్యూనిస్టులనాయకత్వాన నాలుగు వందలమంది నేడు ఇక్కడ ఊరేగింపు తీశారు. హిందువులు, సిక్కులు ఐకమత్యంతో జీవించాలని వారు ప్రజలకు విజ్ఞప్తిచేశారు.

జమ్మివారి "లివర్ క్యూర్"

బిడ్డల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులకు

రోగుల సహాయార్థము మా డాక్టరు ప్రతినెల నిర్ణీత తేదీలలో ఈ క్రింది స్థలములలో ఆయాతేదీలందు సలహాలిచ్చుటకు విచ్చేయుదురు.
సలహా వేళలు: ఉ॥ 9 గం॥నుండి 11; సా॥ 3 నుండి 5 వరకు మాత్రమే.

స్థలము	తేది	అడ్రసు
తెనాలి	12 (ఉదయం)	కన్యకా పరమేశ్వరి సత్రం.
గుంటూరు	14 (,,)	మెడికల్ స్టోర్సు, కొత్తపేట.
బందరు	16 (,,)	ఆనందఫార్మసి, కెమిస్టు, మెయిన్‌రోడ్
రాజమండ్రి	19 (,,)	ఈశ్వరదాస్ అండ్ కో; మెయిన్‌రోడ్.
భీమవరం	20 (,,)	ప్రసాద్‌సన్స్ అండ్ కో; కెమిస్టు, అండ్ డ్రగ్గిస్టు
జంషెడ్‌పూర్	ప్రతి నెల చివర ఆదివారం ఉదయం, సాయంత్రం	ఆంధ్ర డ్రమటిక్ అండ్ లిటరరీ సొసైటీ, సక్చి
ఖరగ్‌పూర్	ప్రతి నెల 4వ తేది ఉదయం, సాయంత్రం	యునైటెడ్ మెడికల్ స్టోర్సు కెమిస్టు అండ్ డ్రగ్గిస్టు, యస్. టి. 2155 ట్రాఫిక్ మార్కెట్

జమ్మి వెంకటరమణయ్య & సన్స్ H. O మద్రాసు-4.

బ్రాంచీలు: గవర్నరుపేట-విజయవాడ: ఓరుగంటివారివీధి-విజయనగరం.
182/1 హారిసన్‌రోడ్, కలకత్తా.

బొంబాయిని మహారాష్ట్రలో చేర్చాలని విజ్ఞప్తి

డిటెన్షన్‌లో ఉన్న డాంగే ప్రభృతుల విడుదలకై ప్రభుత్వానికి అభ్యర్థన

విశాలాంధ్ర కమ్యూనిస్టు మహాసభ తీర్మానం

హైదరాబాద్, జూలై 8

బొంబాయినగరంపై కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ, ఆ నగరాన్ని సంయుక్త మహారాష్ట్రలో చేర్చాలని కోరుతూ, ప్రథమ విశాలాంధ్ర కమ్యూనిస్టు మహాసభ తీర్మానించింది. మహారాష్ట్ర ప్రజల కోర్కెను బలపర్చాలని తెలుగు ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

ఆ తీర్మానంలో ఇలా వుంది :

బొంబాయి నగరాన్ని సంయుక్త మహారాష్ట్రలో చేర్చాలని పోరాడుతున్న మహారాష్ట్ర ప్రజలను ఈ మహాసభ అభినందిస్తోంది. తమ జాతీయ వాంఛల కొరకై ఆందోళన చేస్తున్న ప్రజలపై తీవ్రనిర్బంధ విధానాన్ని అమలు జరుపుతున్న, అనేక మంది ప్రజల ప్రాణాలను బలిగొన్న ప్రభుత్వ చర్యలను ఈ మహాసభ తీవ్రంగా నిరసించుతోంది.

బొంబాయి నగరం మహారాష్ట్ర ప్రాంతంలో వుందనే సత్యాన్ని ఒకవైపున అంగీకరించుతూనే, రెండోవైపున దానిని సంయుక్త మహారాష్ట్రలో చేర్చ నిరాకరించుతూ కేంద్రపాలిత ప్రాంతంగా వుంచాలని వాదించుకున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఈ మహాసభ తీవ్రంగా నిరసించుతోంది. ఈ అపసవ్య వైఖరిని విడనాడి కేంద్ర ప్రభుత్వం బొంబాయి నగరాన్ని సంయుక్త మహారాష్ట్రలో చేర్చాలని ఈ మహాసభ డిమాండు చేస్తోంది. సోదర మహారాష్ట్ర ప్రజల న్యాయమైన కోర్కెను అన్నివిధాలా బలపరచాలని తెలుగు ప్రజలకు విజ్ఞప్తి చేస్తోంది.

ఈ ఉద్యమ సందర్భంలో అరెస్టు చేయబడిన వారి నందరినీ విడుదలచేయాలని, డిటెయిన్ చేయబడిన భారత కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ డాంగేను, యితర నాయకులను విడుదల చేయాలని ఈ మహాసభ కోరుతోంది.

భారత విదేశాంగ విధాన ప్రాశస్త్యం

ఇండొనేషియా పార్లమెంటు సభ్యుని ప్రశంస

శ్రీనగర్, జూలై 7

ప్రపంచ శాంతికి, ఆసియా శాంతికి తోడ్పడుతున్న భారతదేశ విదేశాంగ విధానాన్ని ఇండొనేషియా ప్రజలు మెచ్చుకుంటున్నారని ఇండొనేషియా పార్లమెంటు సభ్యుడు మాజీమంత్రి అయిన సుతేమో నేడిక్కడ తెలియజేశారు. ఇండియా, ఇండొనేషియాలు ప్రపంచ శాంతి రక్షణకు కంకణం కట్టుకొన్నవన్నారు.

భారతదేశంలో పర్యటిస్తున్న సుతేమో, శ్రీనగర్‌నుంచి బయలుదేరేముందు పైవిధంగా చెప్పారు.

అనేక శతాబ్దాల విదేశ పాలనలో మగ్గినతర్వాత, ఆసియాదేశాలు కొన్ని స్వాతంత్ర్యం సంపాదించాయి. ఈ దేశాలు ఆర్థిక స్వాతంత్ర్యంపై ఆధారపడిన నూతనసాంఘిక వ్యవస్థను నిర్మించుకోవలసివుంది. ఈమహాకర్తవ్యంలో పురోగమనం సాగిస్తున్న భారతదేశం, సోదర ఆసియా దేశాలకు సహాయపడగలదని మానమ్మకం. మనప్రజల జీవిత ప్రమాణాలను పెంచడానికిమనమంతా కలిసి పాటుబడాలి అని ఆయన పేర్కొన్నారు.

ఇండియా, ఇండొనేషియాలు పరస్పర యాత్రా ప్రతినిధివర్గాలను పంపుకుంటూవుండాలని సుతేమో అభిప్రాయం వెలిబుచ్చారు. ఇందువల్ల తరతరాలుగా ఉభయదేశాల మధ్య నెలకొన్న సాంస్కృతిక ఐక్యత పెంపొందగలుగుతుందన్నారు.

భారతదేశ పురోగమనానికి తాను ముగ్ధుడనైనానని చెబుతూ, భారతసందర్శన ప్రాశస్త్యం తనకు చాల సంతోషం కలిగించిందన్నారు.

తమిళనాడు జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు. కార్యవర్గం సమావేశం అయి వచ్చే ఎన్నికలలో కాంగ్రెసు అభ్యర్థులను బలపరచాలని నిర్ణయించింది

ఐసెన్‌హోవర్ మళ్లీ పోటీ చేస్తాడట

న్యూయార్క్, జూలై 7

అమెరికన్ అధ్యక్ష ఎన్నికలలో మళ్ళీ ఐసెన్‌హోవర్ పోటీచేస్తాడని రిపబ్లికన్ నాయకులు చెబుతున్నట్లు "న్యూయార్క్-టైమ్స్" నేడు మొదటి పేజీలో వార్త ప్రచురించింది.

ఇండియాలో అమెరికా రాయబారిగా నున్న జాన్ షెర్మన్ కూపర్‌ని సెనేట్ ఎన్నికలలో పోటీ చేయవలసిందిగా ఐసెన్‌హోవర్ కోరడం, అందుకు సాధ్యమని చెప్పబడుతున్నట్లు "న్యూయార్క్-టైమ్స్" రాజకీయ విలేఖరి జేమ్స్‌రెస్టన్ వాషింగ్టన్‌నుంచి రాశాడు.

ఐసెన్‌హోవర్ పోటీ చేయాలని కోరుతూ వచ్చే బుధవారం న్యూయార్క్‌లో పెద్ద ప్రదర్శనం జరగబోతోంది. ఇలాంటి ప్రదర్శనాలు ముఖ్యమైన అమెరికన్ నగరాలన్నిటిలోనూ జరుగుతాయట.

దక్షిణప్రదేశ్ వివాదంలో కాంగ్రెస్‌వారు పాల్గొనరాదు

తమిళనాడ్ కాంగ్రెసు కార్యవర్గ తీర్మానం

మద్రాసు, జూలై 8

దక్షిణప్రదేశ్ నిర్మాణంపై జరుగుతున్న వివాదంలో కాంగ్రెసు కమిటీలుగానీ, కాంగ్రెసువాదులు గానీ, పాల్గొనరాదని కోరుతూ తమిళనాడ్ ప్రదేశ్ కాంగ్రెసు కార్యవర్గం నేడొక తీర్మానం చేసింది.

ఇటీవల శ్రీ రాజగోపాలాచారి దక్షిణ ప్రదేశ్ నిర్మాణానికి కాంగ్రెసు వాదులు పూర్తిగా కృషిచేయాలని ప్రచారం చేస్తున్న ఫలితంగా ఈ సమస్యను గురించి మొట్టమొదటిసారిగా ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ చర్చించి తీర్మానం చేయవలసివచ్చింది.

కార్యవర్గం మూడు గంటలపాటు చర్చించిన అనంతరం ఈ తీర్మానాన్ని ఆమోదించింది.

ఆ తీర్మానంలో యిలా వుంది :

"దక్షిణ ప్రదేశ్ నిర్మాణ సమస్య నేడు కాంగ్రెసు సంస్థను చీల్చి, బలహీనపరుస్తున్న ప్రమాదాన్ని చూసి తమిళనాడ్ ప్రదేశ్ కాంగ్రెసు కార్యవర్గం ఆందోళన పడుతోంది. ఏకభాషా రాష్ట్రాలనిర్మాణం, బహు భాషా రాష్ట్రాల నిర్మాణం-రెండూ కూడా దేశైక్యతను కాపాడే దృష్టితోనే ప్రతిపాదించబడ్డాయి.

"కాని ప్రస్తుత సమయంలో ఈ సమస్యను వివాదాస్పదమైన పద్ధతిలో తీసుకొనిరావడంవలన అందుకు విరుద్ధమైన ఫలితంజరుగుతున్నది. కాంగ్రెసు సంస్థ బలహీనపడుతుంది. అందువలన ఈ సమస్యను సంబంధించిన వివాదాస్పదమైన కార్యకలాపాల్లో కాంగ్రెసు కమిటీలు, కాంగ్రెసువాదులు పాల్గొనరాదని ప్రదేశ్ కాంగ్రెసు కార్యవర్గం కోరుతోంది. కాంగ్రెసువారు అంతా ద్వితీయ పంచవర్ష ప్రణాళికను అమలు జరపడంలోనూ, కాంగ్రెసు సంస్థను బలపరచుకోవడంలోనూ నిమగ్నులై వుండాలని కోరుతోంది."

నేడు జరిగిన సమావేశానికి పదముగ్గురు సభ్యులు హాజరయ్యారు. దక్షిణప్రదేశ్ నిర్మాణాన్ని, కనీసం తమిళనాడ్ కేరళల ప్రాంతాలను కలపాలని గట్టిగా వాదించే అర్థికమంత్రి శ్రీసుబ్రహ్మణ్యంసమావేశంలో పాల్గొన్నారు.

దక్షిణ ప్రదేశ్ నిర్మాణానికి తమిళనాడ్‌లో ప్రస్తుతం సరియైన వాతావరణం ఏర్పడిందని కాంగ్రెసు అధ్యక్షునికినచ్చచెప్పేందుకు ఇటీవలనే ఢిల్లీవెళ్ళివచ్చిన తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెసు ఉపాధ్యక్షుడు శ్రీ వెంకటకృష్ణారెడ్డియార్, శ్రీ టి. కృష్ణమూర్తిగార్లు సమావేశానికి హాజరుకాలేదు.

సమావేశంలో పాల్గొన్నవారిలో ముఖ్యమంత్రి శ్రీ కామరాజ్ నాడార్ కేంద్రమంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి వున్నారు.

కార్యవర్గం మరొక తీర్మానంచేస్తూ మద్రాసు-ఆంధ్రరాష్ట్రాల మధ్య సరిహద్దుల విషయంలో ఇంతవరకూ ఎలాంటి పరిష్కారం జరుగలేదనీ, ఉభయప్రభుత్వాలమధ్య ఒడంబడిక సాధ్యంకానిపక్షంలో సరిహద్దు కమిషన్‌ను నియామకానికి తగినచర్యలు తీసుకోవాలని మద్రాసుప్రభుత్వాన్ని కోరారు.

చౌ-ఎన్-లై డల్లెస్ సమావేశం జరగదట

అమెరికన్ ఉపాధ్యక్షుని ప్రకటన

తైపే, జూలై 8

అమెరికా విదేశాంగ మంత్రి డల్లెస్, చైనా ప్రధాని, విదేశాంగ మంత్రి అయిన చౌ-ఎన్-లై సమావేశమయ్యే అవకాశం లేదని, అమెరికా ఉపాధ్యక్షుడు నిక్సన్ నేడిక్కడ అన్నారు.

"ఇలాంటి సమావేశం భవిష్యత్తులో జరిగితే నేను ఆశ్చర్యపోతాను" అని ఆయన అన్నారు.

ఇక్కడనుంచి ఆయన బాంకాక్ వెడుతున్న సందర్భంలో విమానాశ్రయంలో పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ పైవిధంగా చెప్పారు.

"చైనా కమ్యూనిస్టు నాయకులు క్రెమ్లిన్ నాయకులవలెనే, మాటలలో మాత్రం స్టాలిన్ పద్ధతులను విడుస్తున్నామంటూ, చేతలలో ఆ పద్ధతులను అనుసరిస్తున్నా మన్నంతకాలం" డల్లెస్, చౌ ఎన్ లై ల సమావేశం జరగబోదన్నారు.

చాంగ్ కైషేక్‌తో మూడున్నర గంటలపాటు నిక్సన్ మాట్లాడారు.

ఆంధ్ర-హైద్రాబాద్‌లలోని హిందీ ప్రచార సభల సంలీనం

హిందీప్రచార సమ్మేళనం తీర్మానం

హైదరాబాద్, జూలై 8

విశాలాంధ్ర ఏర్పడబోతున్న దృష్ట్యా హైదరాబాద్, ఆంధ్ర రాష్ట్రాల్లో కేవున్న రెండు హిందీ ప్రచారసభలను సంలీనంచేసి ఒకే సంస్థగా రూపొందించడానికి కేంద్ర ప్రచార సమ్మేళనం నేడిక్కడ తీర్మానించింది.

భారతదేశ సాంస్కృతిక ఐక్యత సంరక్షించుకోవాలని

శ్రీ బూర్గుల ఉద్బోధ

హైదరాబాద్, జూలై 8

భారతీయ సంస్కృతి అంతా ఒక్కటేనని నొక్కి చెప్పవలసిన సమయం ఆసన్నమైనదని నేడిక్కడ హైదరాబాద్ ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణారావు అన్నారు.

ఇక్కడజరుగుతున్న హిందీప్రచార సమ్మేళనసందర్భంలో ఏర్పాటు చేయబడిన సాహిత్య, కళా ప్రదర్శనాన్ని శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు ప్రారంభిస్తూ రాష్ట్రాలపునర్విభజన జరుగుతున్నదృష్ట్యా మన సాంస్కృతిక ఐక్యతకు భంగం వాటిల్లకుండా జాగ్రత్తపడాలని చెప్పారు. మన సాంస్కృతిక ఐక్యతను నిలుపుకోటానికి అన్నివిధాల కృషి చేసుకోవాలనికూడా ఆయనన్నారు.

ప్రదర్శన ప్రారంభోత్సవ సభకు హైదరాబాద్ విద్యామంత్రి శ్రీ కొండా వెంకటరంగారెడ్డిగారు అధ్యక్షత వహించారు.

ఈ ప్రదర్శనశాలలో ప్రాచీన వ్రాతప్రతులను, హిందీ, ఉర్దూ, తెలుగు, మరాఠి, కన్నడ గ్రంథాలను అనేక చిత్రాలను ప్రదర్శించారు.

శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు ఇంకా మాట్లాడుతూ భారతదేశ సాంస్కృతిక ఐక్యతను కాపాడటానికి హిందీభాషా వ్యాప్తి మంచి సాధనంగా వుండగలదన్నారు.

అఖిలభారత భాషగా హిందీని వ్యాప్తిపొందించాల్సిన అవశ్యకత

హైద్రాబాద్‌లో జరుగుతున్న హిందీసమ్మేళనంలో రాష్ట్రపతి ప్రభృతుల ప్రసంగాలు

హైదరాబాద్, జూలై 7

"మన దేశంలో జరుగుతున్న హిందీ ఉద్యమం భారతీయ భాషల పునరుజ్జీవనానికి సాగుతున్న ఉద్యమం. అన్ని ప్రాంతీయ భాషలమధ్య దృఢమైన ఐక్యతను మనం సాధించాలి" అని నేడిక్కడ ప్రారంభమైన హిందీ ప్రచార సమ్మేళనానికి అధ్యక్షత వహిస్తూ శ్రీ మోటూరు సత్యనారాయణగారు ఉద్బోధించారు.

దక్షిణభారత హిందీ ప్రచారసభ వారి హైదరాబాద్, ఆంధ్రశాఖల సంయుక్త యాజమాన్యాన యీ సమ్మేళనం ఏర్పాటు చేయబడింది. అధికార, అనధికార ప్రముఖులు చాలమంది సమావేశానికిఅరుదెంచారు.

రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ సమ్మేళనాన్ని ప్రారంభించారు.

అధ్యక్షులు శ్రీ మోటూరు సత్యనారాయణగారు ఉపన్యసిస్తూ హిందీ ఉద్యమానికి బలీయమైన శత్రువు లిద్దరున్నారన్నారు. "తక్షణం ఇంగ్లీషును తీసేసి, దానిస్థానంలో హిందీని పెట్టాలనే వారొకరు; దక్షిణాదిన హిందీ మీద దాడిచేసేవా రింకొకరు" అని అన్నారు.

"దేశంలోని అన్ని ప్రాంతాలూ అంగీకరించిననాడే ఏ భాషైనా జాతీయభాష కాగలుగుతుంది. సర్వత్రా అలాంటి ఆమోదాన్ని సంపాదించడానికి శక్తివంచనలేకుండా కృషి జరగాలి.

"హిందీమూలంగా దాక్షిణాత్యుల మీదఉత్తరాదుల ఆధిపత్యంఏర్పడుతుందనుకోవడంకూడా నిరాధారం. ఉత్తరదేశం రాజకీయంగా ఎన్నడూ దక్షిణాదిని పరిపాలించలేదు."

అందుచేత హిందీపై వ్యాప్తిలో ఉన్నదురభిప్రాయాలను తొలగించడం అవసరమని శ్రీ సత్యనారాయణగారు తమ అధ్యక్షోపన్యాసంలో అన్నారు.

రాష్ట్రపతి ప్రసంగం

రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ సమ్మేళనాన్ని ప్రారంభిస్తూ ఈ మహాదేశంలోని వివిధ ప్రాంతాల మధ్య ఐకమత్యాన్ని ఏర్పర్చడానికి, ఆయా రాష్ట్రాల మధ్య సాన్నిహిత్యాన్ని సాధించడానికి ఒక అఖిలభారత భాష ముఖ్యమన్నారు. హిందీ భాషా వ్యాప్తికోసం ఆయా రాష్ట్రాలు శ్రద్ధ వహించాలన్నారు.

భారతీయ భాషల్లో శాస్త్రమూ, సాహిత్యమూ బాగా అభివృద్ధి పొందలేదనీ, వాటిని అభివృద్ధి పర్చుకోవడం అసాధ్యంకూడా కాదనీ రాష్ట్రపతి అన్నారు. మన భాషల్లో కొత్త పదాలనూ, ప్రయోగాలనూ ఖాయం చేసుకుంటే ఇతోధికమైన అభివృద్ధికి అవకాశముంటుందన్నారు.

"ఎక్కువమంది మాట్లాడే భాష కావడంవల్లనే హిందీ రాజభాషగా తీసుకోబడిందికాని, ఇతర భాషల్లో లోపముందని మాత్రంకాదు. ఇతర ప్రాంతీయ భాషలుకూడా హిందీ స్థాయిలో లేకపోలేదు" అన్నారు రాష్ట్రపతి.

హిందీ ప్రచారంపై అపోహ పెట్టుకోవద్దు

ఆ యా ప్రాంతీయ భాషలను త్రోసిరాజని వాటిస్థానాన్ని హిందీకి కట్టబెట్టాలన్న ఉద్దేశం హిందీ ప్రచారకులకు లేదనికూడా రాష్ట్రపతి హామీయిచ్చారు. అందుచేత వివిధ భాషల మధ్య వైరుధ్యానికిగాని, వైమనస్యానికిగాని ఆస్కారం లేదన్నారు.

దక్షిణ భారతదేశంలో ఆదినుంచీ హిందీ ప్రచారోద్యమం మహోద్యమంగా సాగిందన్నారు. ఈ కృషిలో దక్షిణ భారత హిందీ ప్రచారసంస్థతో పోల్చదగిన సంస్థ మరొకటి లేదనికూడా రాష్ట్రపతి అన్నారు.

హిందీ ప్రచారకుల ప్రవర్తన హిందీని బలవంతాన రుద్దుతున్నట్లుగా ఉండకూడదని రాష్ట్రపతి సలహాయిచ్చారు.

సుప్రీం కోర్టులోగాని, పార్లమెంటులోగాని ఇంగ్లీషు అవసరంలేని దశ వస్తుందని కూడా ఆయన అన్నారు. తమతమ మాతృభాషల్ని, ప్రాంతీయ భాషల్ని అభివృద్ధి చేసుకుంటూనే జాతీయ భాషకు కూడా దోహదమివ్వాల్సి ఉంటుందన్నారు.

ఆంధ్రదేశంలో హిందీ పట్ల అభిమానం చాల మెండనీ, తాను కాంగ్రెసు అధ్యక్షుడుగా వున్న రోజుల్లో సంచారానికి వచ్చినప్పుడు హిందీలోనే ఉపన్యసించవలసిందిగా ఆంధ్రప్రజలు అడుగుతూండేవారనీ రాష్ట్రపతి వుదహరించారు. హైద్రాబాదులో ఇస్లాంపరిపాలన సాగినందువల్ల ఉర్దూ వ్యాప్తి పొందిందనీ, హిందీ ఉర్దూలు ఒకే భాషయొక్క వేర్వేరు రూపాలనీ, ఒక దానిలో సంస్కృతం, రెండోదానిలో అరబిక్ పదాలు అధికంగా వుండటమే భేదమనీ, రెంటి వ్యాకరణంకూడా ఒకటేననీ రాష్ట్రపతి వివరించారు. ఈ కారణాలన్నిటివల్లా ఇక్కడ హిందీ ప్రచారం బహు సులభమన్నారు.

హైదరాబాదు వ్యవసాయ మంత్రి డాక్టర్ చెన్నారెడ్డిగారు సమ్మేళనాని కరుదెంచినవారి కందరికీ స్వాగత వాక్యాలు చెప్పారు.

ఆంధ్ర ముఖ్యమంత్రి ప్రసంగం

ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు ప్రసంగిస్తూ, హిందీ ప్రభుత్వభాషగా ఉన్నా, ప్రాంతీయ భాషలకు సంపూర్ణమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, అభివృద్ధి ఉంటాయన్న ఇటీవలి రాష్ట్రపతి ప్రకటన ప్రశంసాపాత్రమైందన్నారు.

శ్రీగోపాలరెడ్డిగారు ఆరుభాషల్లోని ఏకాంకనాటికల ప్రదర్శనానికి ప్రారంభోత్సవం చేశారు.

శాస్త్రమూ, పత్రికలూ దేశంలో అభివృద్ధి పొందుతున్నా, సాహిత్యానికీ, సంస్కృతికీగల ప్రాముఖ్యాన్ని మాత్రం దేశం మరచిపోకూడదని గోపాలరెడ్డిగారు హెచ్చరించారు. పాత సంతతిని పనికిరాదనడం దేశాభ్యుదయానికే మంచిదికాదన్నారు.

నూనె వనరుల రక్షణకు సైప్రస్ అవసరమట

వలస విధానాన్ని సమర్థించుకుంటూ బ్రిటిష్ విదేశాంగమంత్రి ప్రకటన

బార్కి, జూలై 7

సైప్రస్‌లో అట్లాంటిక్ కూటమికి ఒక స్థావరంవుంటేనే, మధ్యప్రాచ్యంలో బ్రిటన్ తన "బాధ్యతల"ను నెరవేర్చడానికి సరిపోతుందన్న సూచనను బ్రిటిష్ విదేశాంగ మంత్రి సెల్విన్ లాయిడ్ నిరాకరించారు.

కన్సర్వేటివ్ పార్టీ సమావేశంలో లాయిడ్ ప్రసంగిస్తూ ఇలా అన్నారు :

"సైప్రస్ ప్రాముఖ్యతను తక్కువ అంచనా వేయకూడదు. ఆ దీవిలో మనకున్న రక్షణసౌకర్యాలను సక్రమంగా వినియోగించుకున్నప్పుడు, మధ్యప్రాచ్యంలో అన్ని దేశాలపట్ల మన సంధి బాధ్యతలను నెరవేర్చగలుగుతాం"

సైప్రస్ అవసరం బ్రిటన్‌కు మాత్రమే కాదని, టర్కీకి కూడా అది కీలకమైన విషయమని లాయిడ్ అన్నారు. అట్లాంటిక్ కూటమి సమస్య అలావుంచి, బ్రిటన్, పశ్చిమ యూరప్‌ల పారిశ్రామిక జీవితం, చాలవరకు మధ్యప్రాచ్య నూనె సప్లయిపై ఆధారపడుతుందనిఅన్నారు.

"ఈ నూనె వనరులకు ప్రమాదం ఏర్పడితే, వాటిని మనం రక్షించవలసివుంటుంది. సైప్రస్‌లో మనకున్న సౌకర్యాలు, ఆ రక్షణలో భాగాలే. అందుచేత వాటి విషయంలో మనం అనిశ్చిత పరిస్థితిలో పడలేం. ఏదో పరిష్కారంకోసం ప్రయత్నిస్తాం.

ఎట్టి పరిష్కారాన్ని మనం సూచించినా, నేను పైనచెప్పిన విషయాలు దృష్టిలో పెట్టుకోవాలి. కామన్వెల్తు ప్రధానులుకూడా, పరిష్కార సాధనకు మనం చేస్తున్న యత్నాలను హర్షించారు."

బ్రిటిష్ ప్రభుత్వ వలసవిధానాన్ని సమర్థిస్తూ, తాము గర్వించవలసింది ఎంతైనా వుందన్నారు. మలయా, నైజీరియా, గోల్డ్ కోస్టులలో అతివేగంగా రాజ్యాంగ పరిణామాలు సాగుతున్నవన్నారు.

"సహనశీలం పెంపొందించాలి"

కేంద్ర హోంమంత్రి శ్రీ గోవిందవల్లభపంత్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూలై 8

దేశప్రజలలో సహనశీలమూ, సమైక్యతాభావం పెంపొందించాలని కేంద్ర హోంశాఖ మంత్రి పండిత గోవిందవల్లభపంత్ నేడిక్కడ భారత సిక్కు సమాఖ్య వారు ఏర్పాటుచేసిన మహారాజా రంజిత్‌సింగ్ వర్ధంతి సభలో ప్రసంగిస్తూ విజ్ఞప్తి చేశారు.

దేశంలో ఎవరైనా పొరపాటు చేసినప్పుడు, అలాంటివారిపై ఆగ్రహపడరాదనీ, అనురాగ బంధనాలు ఎట్టిపరిస్థితులలో తెగిపోరాదనీ ఆయన అన్నారు. ఒకవేళ ఎవరైనా తప్పు చేస్తే, అలాంటివారిని అనురాగపూర్వకంగా సరిదిద్దవలసి వుంటుందని శ్రీ పంత్ నుడివారు.

దేశంలోని వారందరికీ తినటానికి తిండి, ఉండటానికి యిల్లు సమకూర్చేందుకు అనువైన పరిస్థితులను దేశంలో సృష్టించాలని శ్రీ గోవింద వల్లభపంత్ అన్నారు.

భూగర్భంలోని ఉష్ణశక్తిని వినియోగించే యత్నం

సోవియట్ శాస్త్రజ్ఞుల కృషి

మాస్కో, జూలై 6

భూగర్భంలోని ఉష్ణశక్తిని జాతీయార్థిక రంగానికి వినియోగించడం గురించి మాస్కోలో ఒక విజ్ఞానశాస్త్ర సమావేశం జరిగింది.

సోవియట్ దేశపు యూరోపియన్, ఆసియా ప్రాంతాలలో భూమిలో సుమారు మైలులోతున వేడినీరు, ఆవిరి వున్నాయని కనుగొన్నారు. భూమిలోగల ఈ ఉష్ణశక్తిని విద్యుచ్ఛక్తి వుత్పాదనకూ, వేడినీరు సప్లయిచేయడానికీ వినియోగించేందుకు సోవియట్ ఇంజనీర్లు లెక్కలు పూర్తిచేశారు. ఈ ఉష్ణశక్తితో నడిచే విద్యుత్కేంద్రాల నమూనాలను కూడా తయారు చేస్తున్నారు. వీటిని ప్రధానంగా కామ్‌చట్కా, కురైల్ దీవులు, కాకసస్, మధ్య ఆసియాలకు ఉద్దేశించారు.

ఇతర దేశాలలో, ముఖ్యంగా ఇటలీలో ఇటువంటి పద్ధతిలో విద్యుచ్ఛక్తి ఉత్పాదన సాధనాన్ని కూడా వినియోగించుకోవడం జరుగుతూంది.

భూమిలోని ఉష్ణశక్తివల్ల ఉత్పత్తి అయ్యే విద్యుచ్ఛక్తి ఖరీదు, జలవిద్యుత్కేంద్రాలు ఉత్పత్తిచేసే విద్యుచ్ఛక్తితో పోల్చితే నాలుగురెట్లు చవక అవుతుందని అంచనాలు వెల్లడిస్తున్నాయి.

చిన్న పరిశ్రమలలో యంత్రాల ఉపయోగం

ప్రభుత్వం వ్యతిరేకం కాదని శ్రీ కృష్ణమాచారి

మద్రాసు, జూలై 8

శాస్త్రీయమైన తీరునేయని పద్ధతిలో చిన్నతరహా పరిశ్రమలు విద్యుచ్ఛక్తి నుపయోగించడాన్ని ప్రోత్సహిస్తామని కేంద్రవాణిజ్య, పరిశ్రమల మంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి నేడిక్కడ అన్నారు.

పారిశ్రామిక యజమానులు, వ్యాపారస్థులు, పత్రికా విలేఖరుల సభలో ఆయన ప్రసంగిస్తూ, చిన్నతరహా పరిశ్రమలలో యంత్రాల నుపయోగించడంలో ప్రభుత్వ విధానాన్ని వివరించారు.

ప్రభుత్వం వుద్దేశం యంత్రాలు వచ్చి మనుష్యుల్ని నిరుద్యోగులను చేయరాదనేగాని, చిన్నతరహా పరిశ్రమలలో యంత్రాల నుపయోగించడం కూడదని కాదు అన్నారు.

ప్రభుత్వమే చిన్నతరహా పరిశ్రమలను కొనసాగించాలనే అభిప్రాయం లేదనీ, చిన్నతరహా, మధ్యరకం పరిశ్రమలను స్థాపించేటట్లు వ్యక్తులకు ప్రోత్సాహం యిస్తుందనీ అన్నారు. దీనికై రుణాలిచ్చీ, సౌకర్యాలిచ్చీ తోడ్పడుతుందని అన్నారు.

ఈ విధానాన్ని పంజాబ్ బాగా వుపయోగించుకున్నదనీ, అక్కడ పాకిస్తాన్‌నుంచి నిరాధారులుగా లేచి వచ్చినవారికి పని చెబుతూ ఎన్నో పరిశ్రమలు ప్రారంభించడ్డాయని అన్నారు.

ప్రభుత్వ వ్యాపారసంస్థ

ఎగుమతి వ్యాపారంలో గుత్త అధికారం తప్పనిసరి అయ్యే పక్షంలో దానిని వ్యక్తులకు వదలడంకన్న ప్రభుత్వమే తన చేతులలో వుంచుకోవడం ఉచితము అని ఆయన అన్నారు.

ప్రభుత్వ వ్యాపారసంస్థ కార్యకలాపాలు ఎంతవరకు విస్తరింపచేయబడతాయో చెప్పడం కష్టమంటూ, అది క్రమంగా విస్తరింప చేయవలసిన అవసరం ఏర్పడుతూవుంది అన్నారు.

చైనా కోస్తా ప్రాంతాలపై కొమింటాంగు వారి దురాగతాలు

లండన్, జూలై 8

గతవారంలో కొమింటాంగ్ విమానాలు 39సార్లు చైనాకోస్తాప్రాంతాలపైకి దాడులు చేయవచ్చాయని నవచైనా వార్తాసంస్థ తెలిపింది. నిన్ననే చైనా కోస్తా ఫిరంగులు ఒక కొమింటాంగు విమానంపై దెబ్బ తీశాయని తెలిపింది. ఈ 39 సార్లు కూడా కొమింటాంగ్ అమెరికన్ విమానాలు దళాలుగా వచ్చాయన్నది.

అంతే కాకుండా జూలై మొదటి తేదీనుండి ఎనిమిదవ తేదీలోగా క్వెమోయ్ దీవిలోని కొమింటాంగు ఫిరంగులు చైనాకోస్తాపై ఫ్యుకీన్ ప్రాంతం మీద గుళ్ళుకురిపించాయనీ, ఒకతను చనిపోవడమూ, అయిదుగురు గాయపడడమూ జరిగిందనీ ఈ వార్తాసంస్థ తెలిపింది.

తైవాన్ సమస్యపై చౌఎన్‌లై ప్రకటన

థాయిలాండ్ ప్రధాని విదేశాంగమంత్రుల వ్యాఖ్యలు

పెకింగ్, జూలై 8

"తైవాన్ సమస్యపై కొమింటాంగ్ ప్రతినిధులతో సంప్రతింపులు జరపటానికి చైనా ప్రజాతంత్ర రిపబ్లిక్ సన్నద్ధంగా వుందని చైనా ప్రధాని చౌ ఎన్ లై ఇటీవల చేసిన ప్రకటన పూర్వ ఆసియాలో శాంతి నెలకొనటానికి ఉపకరిస్తుందని థాయిలాండ్ విదేశాంగమంత్రి వ్యాఖ్యానించారు.

"తైవాన్ సమస్యకు శాంతియుతంగా పరిష్కారం కుదిరితే, ప్రపంచశాంతి సుస్థిరం కావటానికి తోడ్పడుతుంది" థాయిలాండ్ ప్రధాని ఫీల్డ్ మార్షల్ సంగ్రామ్ చౌ ఎన్ లై ప్రకటనపై వ్యాఖ్యానిస్తూ పేర్కొన్నారు.

"తైవాన్ సమస్య చైనా కుటుంబ వ్యవహారం" అని ఆయన అన్నారు.

భారత భూమిపై బుడతకీచుల తిష్ఠ

ఆచార్య వినోబా విమర్శ

పురుషోత్తపురం, జూలై 9

నిన్న సాయంకాలం ఆచార్య శ్రీ వినోబాభావే ప్రార్థనానంతరసభలో ఉపన్యసిస్తూ భారత భూభాగంలో పోర్చుగీసు ప్రభుత్వం స్థావరాలను అంటిపెట్టుకు కూర్చోవడాన్ని నిరసించారు.

ఆచార్య వినోబాభావే ఆగస్టు 15 నుంచి మూడు నెలలపాటు కోయంబత్తూరు జిల్లాలో పర్యటిస్తారు.

తాళపుచెవులు దొరికినవి

వారంరోజులనాడు, విజయవాడ-రామవరప్పాడు సిటీబస్సు నెం. 6 బస్సులో సీటుతోపాటు వున్న ఒక తాళపు చెవుల గుత్తి రింగ్ దొరికినది. పోగొట్టుకున్నవారు విశాలాంధ్ర-విజయవాడ ఆఫీసునకు వచ్చి తీసికొనవచ్చును.

నోటీసు

విజయవాడ రైల్వే స్టేషనుకు 1 లేక 1½ మైళ్ళ దూరంలోగా రైల్వే స్టాఫ్‌కు నివాసయోగ్యమైన ఇళ్ళు నెలకు రు. 35/- లోపుగా నుండునట్లు కావలెను. ఇల్లుగల స్థలము అద్దెటుల ఇతర సదుపాయములు మున్నగు వివరములతో ఈక్రిందివారికి సోమవారం 13-7-56 తేదీలోగా అందునట్లు పంపవలెను. ఈ క్రిందివారు సంతృప్తిచెంది అనుకూలముగా నుండి, తీసికొనుటకు ఒప్పుకొనినచో ఆసామితో ఒక సంవత్సరం అగ్రిమెంటువ్రాసి తీసికొందురు.

అన్ని వుత్తరములు దానిపై "రెసిడెన్షియల్ అకామడేషన్" అని వ్రాసి డివిజనల్ సూపరింటెండెంట్ (పర్సనల్) వారికి అడ్రస్ చేయవలెను.

యం. యస్. మూర్తి,
డివిజనల్ సూపరింటెండెంట్.
సదరన్ రైల్వే విజయవాడ.

ఇప్పుడే వెలువడినాయి !

కే. శే. శారద డిటెక్టివ్ నవలలు

సాలెగూడు, | కార్యదర్శి,
అందాలదీవి, | హోటల్లో శవం.

ఒక్కొక్కటి పాకెట్ సైజు :

100 పేజీలపైన అందాలుచిందే ముఖచిత్రంతో ముస్తాబులో వి. పి. పద్ధతిలేదు. ఏజెంట్లు తమకు కావలసిన కాపీలకు 25%-లు కమిషను మినహాయించి పైకం పంపాలి.

వివరాలకు : హంస ప్రచురణలు, విజయవాడ - 2



సంపాదకుడు, ముద్రాపకుడు, ప్రచురణకర్త:— కాట్రగడ్డ రాజగోపాలరావు—ముద్రణ. స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు, బకింగ్‌హాం పేట, విజయవాడ. సంపాదకవర్గం :— మోటూరు హనుమంతరావు, [అధ్యక్షులు] కంభంపాటి సత్యనారాయణ, కాట్రగడ్డ రాజగోపాలరావు.